వాళ్ల వెనకే పార్క్‌లోకి నడిచింది సంధ్య. ప్లే గ్రౌండ్‌లో కొంతమంది పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. బిపి, షుగర్‌లు తగ్గించుకునే ప్రయత్నంలో ఓ నలుగురు పెద్దవాళ్లు గబగబా నడుస్తున్నారు. బెంచ్ పైన ఓ నడివయసు జంట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లని చూస్తే మాలతి గుర్తుకొచ్చింది సంధ్యకి. మాలతికి తనపట్ల వున్న ఆరాధన... దాన్ని ఆమె చెప్పిన తీరు, నిన్నో మొన్నో జరిగినట్లు గుర్తుకొచ్చింది.

*

ఒకానొక సాయంత్రం వేళ. ట్యుటోరియల్సూ, కాంపిటీషన్ పరీక్షలు అంటే తెలియని పిల్లలు స్వేచ్ఛా విహంగాలకి మల్లే ఆడుకుంటున్నారు. జుట్టుకి రంగు, వంట్లో కొలెస్టరాలు వుంటాయని తెలియని పెద్దలు అక్కడక్కడా గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. కొందరు గృహిణిలు తులసికోట దగ్గర సంధ్యాదీపం వెలిగిస్తున్నారు.



అతనామె కోసం డాబాపైన ఎదురుచూస్తున్నాడు. మొదట మల్లెల పరిమళం, తరువాత కాలి మువ్వల సడి, విడివిడిగా కట్టిన పసుపుతాళ్లు కలివిడిగా కలిసిపోయి సూత్రాలు ఒకదాని నొకటి తాకి చేసే చిరు సవ్వడి - కొత్త పెళ్లి కూతురు, నెమ్మదిగా మెట్లెక్కి పైకి వచ్చింది. ఆ మేడపైన వాళ్లిద్దరే. ఒకరికెదురుగా ఒకరు ఊసులాడుకునే జంట పక్షుల్లా.

అతను చెపుతున్నాడు, తన కలలు, కోరికలు, ఆశయాలు. ఆమె వింటోంది నవ్వుతూ. మధ్య మధ్య అతని వేళ్లు ఆమె చెవి జూకాలని మీటుతున్నాయి. ముంగురులని సర్దే నెపంతో ఆమె చెంపలని తాకుతున్నాయి.

"మరి నీ సంగతేమిటి? నువ్వేమి చెప్పవే? నీ ఇష్టాలు... నీ కోరికలు..." అడిగాడతడు.

ఆమె ఒకసారి చుట్టూ చూసింది. తూరుపువైపు నీలి ఆకాశం, వెండి మబ్బులు, బారులు తీరి వెళుతున్న కొంగలు. పడమటి కొండల అంచున అరుణ కాంతి...

"ఇదే!" అంది ఆమె అతనికేసి తిరిగి ఉద్వేగంగా.

"ఏమిటి?" అన్నాడతడు ఆశ్చర్యంగా.

అతని అరచేతుల మీద తన చేతులు వుంచి, కళ్లలోకి చూస్తూ చెప్పింది మాలతి. "ఇలాంటి ప్రతి సాయంత్రం నువ్వు నాతో గడపాలి. నీ సాయంత్రాలన్నీ నావి కావాలి."

"ఓస్! అంతేనా!" అన్నాడతడు తేలికగా.

"అంతే," అంటూ అతని మెడ చుట్టూ చేతులు వేసి మరింత దగ్గరయింది.

*

ఇప్పుడెక్కడుంది మాలతి? తలుచుకోగానే సంధ్య ఓ పెద్ద భవంతి ముందుకు వచ్చి నిల్చుంది. రెండతస్తుల ఇంద్రభవనంలాంటి ఇల్లు. సరాసరి మేడ పైకి వెళ్లింది. ఎవరూ లేరు. క్రిందకి దిగి హాల్‌లోకి వచ్చింది. అక్కడ కనిపించింది మాలతి. వయసు మూడు పదులు, చుట్టు కొలత మూడింతలు పెరిగి సోఫాలో కూర్చుని టీవీలో సీరియల్ చూస్తూ. కిటికీ ప్రక్కగా పాకిన సన్నజాజి పరిమళాలని కానుకగా తెచ్చి ఇస్తూ, 'మాలతీ! నేను... నిన్ను వెతుక్కుంటూ వచ్చాను' అంది సంధ్య ఆమె చెవి దగ్గర గుసగుసగా.

మాలతి ఒకసారి కదిలి తిరిగి దీక్షగా చూస్తోంది 'అమ్మ పుట్టిల్లు మేనమామకే తెలుసు' సీరియల్. మూడు తరాల ఫ్యామిలీ కథ! రెండున్నర ఏళ్లుగా ప్రసారమవుతోంది. తల్లిని చంపింది మేనమామే అని తెలిసి, అతనిపై పగ సాధించడానికి తన కోడలితో కలిసి ప్లాన్ చేస్తోంది హీరోయిన్. ఇంతలో మాలతి పక్కన వున్న సెల్ ఫోన్ బర్‌మంటూ కదిలింది. విసుగ్గా కదిలి చేతిలోకి తీసుకుంటే భర్త నుండి టెక్స్ట్ మెసేజ్ - 'మరో క్లయింట్ మీటింగ్... రావడం లేటవుతుంది... నువ్వు డిన్నర్ చేసెయ్!' "రోజు పాడే పాటేగా," విసుగ్గా అంటూ ఫోన్ పక్కకి విసిరేసి లేచి కిటికీ దగ్గరికి నడిచింది మాలతి.

అదే సమయమని, 'అతను రాకపోతేనే. నాతో సమయాన్ని గడుపు. బయటకి వెళ్దాం! లేదా మేడ పైకి వెళ్దాం! ఈ సంధ్యాసమయాన్నీ నువ్వయినా ఆస్వాదించు!' అంటూ సంధ్య ఆరోజుని గుర్తుకు తెస్తూ ఆమె నెరసిన చెంపలు సవరించింది. మాలతి పెదవులపై సన్నని చిరునవ్వు. వెంటనే సంధ్య ఆమె చెయ్యి అందుకుని 'రా! రా! రా!' అంటూ తొందరపెట్టింది. మాలతి నెమ్మదిగా వెనక్కి తిరిగి వీధి తలుపుకేసి రెండడుగులు వేసింది. ప్రసారంలో అంతరాయం ముగిసి సీరియల్ మళ్లీ మొదలయింది. మాలతి వెనక్కి వెళ్లి తిరిగి సోఫాలో కూర్చుంది.

టీవీలో ఆగకుండా మ్రోగుతున్న డోర్‌బెల్. హీరోయిన్ వెళ్లి తలుపు తీసింది. చెప్పులు, చీర



కుచ్చిళ్లు... అలా అలా కెమెరా పైపైకి పాకి గుమ్మంలో నిల్చున్న స్త్రీ మొహం పైకి వచ్చి ఆగింది. 'ఎవరు మీరు? ఎవరు కావాలి?' అడుగుతున్న హీరోయిన్‌ని పక్కకి తోసి లోపలికి వస్తూ చెప్పింది ఆమె, 'నేను సుందర్ భార్యని, సుందర్ లేడా?' 'ఏమిటి మోసం! సుందర్ నా భర్త!' అంటూ హీరోయిన్ కీచుగా అరుస్తూ క్రింద పడిపోయింది.

మాలతి ఆవేశంగా ఊగిపోతూ, "ఓసే! పిచ్చి దానా! అదంతా నీ మేనమామ చేస్తున్న కుట్ర. దాని మాటలు నమ్మకు. బయటకి పంపించెయ్!" అంటూ అరవసాగింది.

అరుస్తున్న మాలతిని అయోమయంగా చూసి, కలవరపడుతూ బయటకి వచ్చేసింది సంధ్య.

ఎందుకిలా మారిపోయిందీ లోకం? కనీసం సాయంత్రం వేళయినా తనవాళ్లతో గడుపుదామని, సేదదీరుదామని లేదే వీళ్లెవరికీ. అందరూ నన్ను మరచిన వేళ... ఈ సంధ్యవేళ... ఎవరితో చెప్పుకోను నా బాధ? ఆవేదనల ఆలోచనలలో కొట్టుమిట్టాడుతూ ఓసారి చుట్టూ చూసి సంధ్య ఉలిక్కిపడింది.

చీకటి తెరలు నెమ్మదిగా జారుతూ నేలని కప్పేస్తున్నాయి. ఎక్కి వచ్చిన వెండి మబ్బుల జాడేలేదు. 'నా వెను వెంటే రా! భయంలేదు!' అని చెప్పే సూరీడు ఎప్పుడో జారుకున్నాడు.

అప్పుడే ఆకాశంలో చోటు చేసుకుంటున్న తారలు, "పరిగెత్తు సంధ్యా! పరిగెత్తు!" అంటూ ఎలుగెత్తి అరిచాయి.

తరుముకొస్తున్న చీకటి శక్తులకి పట్టుబడకుండా సంధ్య వేగంగా పరిగెత్తసాగింది.

పరిగెత్తి... పరిగెత్తి... పడమటి కొండచరియ నుండి క్రిందకి దూకేసింది. ❀



# బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం విమర్శకు

## కుటుంబరావు సమాధానం

# నా స్వగతం



నాకు మన విమర్శకుల మీద ఎక్కువైన అభిప్రాయం లేదని అదివరకే బహిరంగంగా తెలియ జేసుకున్నాను. నా స్వగతానికి నేనే వ్యాఖ్యానం రాసుకోవటానికి కూడా అదే కారణం. సమర్థులైన విమర్శకులు లేరని తోచి నప్పుడు ఎవరి రచనలకు వారు వ్యాఖ్యానాలు రాసు కోవటంలో మహాపాతకమేమీ లేదు. వ్యాఖ్యానాన్ని విమర్శ కింద గణించే విమర్శకులుండటం నాకు విమర్శకుల మీద అభిప్రాయాన్ని బలపరుస్తున్నది.

నా కథలు చప్పున అందరికీ అర్థంకావటం లేదన్న విషయం నా అంతట నాకు తట్టినది కాదు. అది కాలక్రమాన నాకు అవగాహన అయిన సంగతి. గాలుగైదేళ్ల క్రితమే ఒక దినపత్రికలో (ఇప్పుడది అంత రించిపోయింది) నా కథలు 'పూర్వం' ఒకటి రెండు సార్లు చదివితేనేకాని అర్థం అయేవి కావనీ, 'ఇప్పు డిప్పుడు' ఎన్నిసార్లు చదివినా అర్థంకాకుండా ఉండే కథలు రాయటానికి నేను కంకణం కట్టుకున్నాననీ ఒకరు అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ అభిప్రాయాన్ని అప్పట్లో నేను సరిగా పాటించలేదని ఒప్పుకుంటాను. కాని రానురాను నన్ను కూడా ఒక కథకుడి కింద కట్టి కొందరు పత్రికా సంపాదకులూ, తదితర పరిచితులు కూడా నా రచనలను గురించి నన్ను అనుమానాలడ గటం, ప్రారంభించిన తరువాత నా రచనలో లోపం నాకు అర్థం కాసాగింది. (నేను ఎవరి ఉపయోగం కోసం కథ రాస్తున్నానో వారికా కథ అర్థంకాకపోవటం నిజంగా నా లోపమే మరి.)

చాలాకాలం నుంచీ నేను అందరికీ అర్థమయ్యే టట్టే రాయాలని ప్రయత్నం చేస్తున్నాను. నా కథలు నాకు ఎప్పుడూ అర్థం అవుతూ ఉండటంవల్ల కథకు తవుక చెయ్యకుండా నేను కథలో ఎత్తులకే అంశాలను ఎంత విపులీకరించితే పాఠకులకు సులభంగా అర్థ మవుతుందో నా అంతట నేను ఊహించుకోలేని స్థితిలో ఉంటూ ఉంటిని. నా 'కారుణ్యం' మీది విరుద్ధ విమర్శలను గురించి 'స్వగతం' వ్యాఖ్యానంలో చెప్పే ఉన్నాను. ఆ వ్యాఖ్యానం ఎంతో అవసరమని తోచిన మీదటనే అది రాశాను. ఒకరిద్దరు విమర్శకులు నాకు ఆపాదించిన అభిప్రాయాలు కేవలమూ నిరాధారాలు. అవి వారి inferiority complex మాత్రమే ప్రకటిస్తున్న వని చెప్పటానికి నాకు చాలా విచారంగా వుంది.

నేను స్వగతానికి రాసిన వ్యాఖ్యానంలో కొందరు నా ప్రశంసా ప్రేమను కనిపెట్టారు, మరికొందరు నా అహంకారాన్నీ ఆత్మశ్లాఘాపరాయణత్వాన్నీ కని పెట్టారు. ఆ వ్యాఖ్యానం రాసినందుకు నన్ను తప్పు పట్టినవాళ్లలో, నన్ను మెచ్చుకునేవాళ్లూ, స్నేహితులూ ఉన్నారు. సాఫీ అయిన తెలుగు వాక్యాలను సాఫీగా చదవకపోవటంవల్ల ఇటువంటి దురభిప్రాయాలు బయలుదేరుతై.

కొన్ని ఉదాహరణలిస్తాను. 'నా కథలను గురించి పాఠకలోకానికి పనికివచ్చే ముక్క ఒక్కటయినా చెప్పాలని ఏ విమర్శకుడికి , తట్టలేదు.' అందువల్ల

కూడా (వ్యాఖ్యానం రాసినందువల్ల కూడా) సరి అయిన విమర్శన రాలేదని తోచినట్టయితే- ఆలోచించటంలో కొంత ఆత్మవంచనకు తావుండదని నేనను! ఇంకోసారి ('వచ్చేసారి' అని ఉండవలసింది) నన్ను నేనే విమర్శించుకుంటాను. ఆ పైన నా కథల మాట అటుంచి విమర్శకులు నా విమర్శననే విమర్శించవలసివస్తుంది. నీతితో కూడుకున్న కథ ఆధునికంగా ఉండటానికి అవకాశం ఉందనీ, కథ యొక్క నీతి కథ చివర ఉండటంవల్ల కథ యొక్క అందం చెడదనీ నిరూపించటానికి (కాలభైరవుడు) రాశాను. ఇటువంటి వాక్యాలు విమర్శకుల గొంతులకు పచ్చి వెలగకాయలవలె అడ్డంపడుతూ వున్నై.

నా కథలను గురించి పాఠకలోకానికి పనికివచ్చే ముక్కలు చెప్పమనటం నన్ను మెచ్చుకోమనటం కింద కట్టివేసిన విమర్శకుడి విమర్శన అంటే ఏమిటో తెలుసునని ఎట్లా భావించటం. "ఈ పుస్తకాన్ని ఎవరూ చదవరేమో అనే అభిప్రాయంతో గ్రంథకర్తే పుస్తకాధిక్యాన్ని చెప్పదలచుకొన్నట్లు కనబడుతుంది," అని 'ప్రతిభ' 12లో అంటున్నారు. 'రా.సు' అనే ఒకానొక వ్యక్తి. ఈ అభిప్రాయాన్ని రుజువు చెయ్యటానికి నా వ్యాఖ్యానంలోనించి శ్రీరా.సు.గారు ఎన్ని వాక్యాలు ఎత్తిచూపగలరు?

సరి అయిన విమర్శన అనేది రాలేదని నేను అనుకోవటంలో ఆత్మవంచనకు నాకు అవకాశం వుందని నేను ఎరిగి వున్నట్టు స్పష్టంగా మనవి చేసుకున్నాను. అది ఎవరికీ అవసరమైనట్టు కనిపించదు.

కథ యొక్క నీతి కథ చివర ఉండటంవల్ల కథ యొక్క అందం చెడదని నిరూపించటానికి నేను కాలభైరవుడు రాశాను అని అనేసరికి 'కాలభైరవుడు' అందంగా ఉందని నేను ఆత్మప్రశంస చేసుకున్నాననే అపోహతో కాగోలు బుర్రా వెంకట సుబ్రహ్మణ్యంగారు, 'కాలభైరవుడు అందంగా లేదు,' అని అనేవారు. నేను రాసిన వాక్యంలో కాలభైరవుడు అందంగా ఉందనే అర్థంలేదు, ఆ నీతి తీసివెయ్యటంవల్ల అది వున్న దానికి అందంగా ఉండదు అని మాత్రమే వుంది. విమర్శించుతున్న గ్రంథాన్ని ఎదురుగా వుంచుకుని వ్యాకరణ గోపాలుని తెలుగు వాక్యాన్ని అర్థం చేసుకోవటానికి ఒక తెలుగు వ్యక్తి ఊహించటం మొదలు పెట్టవలసిన అవసరమేమిటో నాకు తెలియకుండా వుంది,

నన్ను విమర్శించేవాళ్లు నేనంత తేలికగా ప్రతి మమ్మాయికి జగ్గాయికి దారిపొయ్యేటట్టు రాసేవాణ్ని కానని తెలుసుకోవటం మంచిది. నేను అహంకారినీ, గర్వినీ, ఆత్మవంచకుణ్నీ , ఆత్మశ్లాఘాపరాయణుణ్నీ, ఇంకేమేమైనా కావచ్చునుగాని నా యీ లోపాలు నేను రాసే ప్రతి వాక్యంలోనూ బయట పెట్టుకుంటానని నమ్మటం నాకు అన్యాయం చెయ్యటం అవుతుంది.

***అయినా నా వంటి రచయితల రచనలు ప్రజాబాహుళ్యానికి ఎరుకపరిచే విమర్శకుల యొక్క అవశ్యకత నేను గుర్తించకపోలేదు. అందుకనే కథ రాయటంలో నా అభిప్రాయం మాత్రమే నేను చెప్పి ఆ అభిప్రాయాన్ని విమర్శించే పని విమర్శకులకు వదిలిపెట్టాను.***

నాకు విమర్శకుల మీద గల అభిప్రాయం నేను బహిరంగంగానే చెప్పాను. ఇది నా అభిప్రాయం మాత్రమే! దానికి నేను ప్రచారం ఇవ్వబోను. కాని నా అభిప్రాయమైనప్పటికీ బయటపెట్టాను కనక దాన్ని సమర్థించటానికి ఉదాహరణలిచ్చాను. డాక్టర్ల మాదిరిగానే విమర్శకులు కూడా అత్మ సంరక్షణార్థం ఒకరిలో ఒకరు ఏకీభవించవలసి వుంటుంది. ఒకసారి అచ్చు అయిన కథ యొక్క విలువ తిట్టినప్పుడు తగ్గి, మెచ్చుకోగానే పత్తి ధర లాగా ఎక్కదు.

అయినా నా వంటి రచయితల రచనలు ప్రజాబాహుళ్యానికి ఎరుకపరిచే విమర్శకుల యొక్క అవశ్యకత నేను గుర్తించకపోలేదు. అందుకనే కథ రాయటంలో నా అభిప్రాయం మాత్రమే నేను చెప్పి ఆ అభిప్రాయాన్ని విమర్శించే పని విమర్శకులకు వదిలిపెట్టాను. అటువంటి పని అసంగతమని ఎగ్రైనా నిరూపించవలసి ఉంది.

‘అతి వినయం ధూర్తలక్షణ’మని నమ్మినవాణ్ని కావటంచేత నేను రా.సు.గారి సలహా ప్రకారం ‘సవిన యంగా పరిచయ వాక్యాలు’ రాసుకోలేదు. ‘నేను వట్టి చవటను, గడ్డి తిని ఈ గ్రంథం రాశాను. దీన్నిండా తప్పులే. అయినా పండితులైన తమరు ఇందులో తప్పులు విసర్జించి ఒప్పులే గ్రహించండి,’ అని పీఠికలో రాసుకున్న రచయిత యొక్క గ్రంథాలు బుద్ధిమంతు డెట్లా చదవగలడు! నేను వ్యాఖ్యానం రాసుకోవటం కొందరికి కంటకింపుగా వుండటానికి ఒకటే కారణం వుంది- ఆ వ్యాఖ్యానంలో ‘నేను’ కర్తగా కల వాక్యాలు చాలా ఉన్నై! అందులో అంతకంటే తప్పేమున్నదో ఎవరు చూపినా నేను వారికి శాశ్వతంగా కృతజ్ఞుణ్ణి అయి ఉంటాను.



***స్వగతంలో మూడు కథ ‘కాలభైరవుడు.’ ఇందులో ఉన్న కథలన్నిటిలోకి నా అభిప్రాయంలో ఇది ఉత్కృష్టమైనది. దీనికి ఒక నీతి ఉందనేకాదు. ఇటువంటి కథ రాయటం సులభం కాదు. నేను మళ్లీ ఇటువంటి కథ ఇంకొకటి రాయటానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేను.***

ఇక స్వగతంలో కథలను గురించి-

మొదటిది ‘అరణ్యం.’ ఇందులో, ‘భాస్కరరావు పాత్ర కొంత ప్రకృతి విరుద్ధంగా ఉంది,’ అని రా.సు. గారు. దానికి కారణం- “కథా ప్రారంభంలో అతను (భాస్కరరావు) అరణ్యానికి ఇలచుమించు- తగిపోయే టట్లు చెప్పి (‘మాటాడి’ అని నా అభిప్రాయం) చివరకు మాత్రం మామూలు ప్రపంచంలో సంఘ సంస్కర్తల జాబితాలో చేరాడు.” కథారచనలో అభిప్రాయమే ఇంచుమించు అది. అందులో సామాన్య జీవితానికి కొంచెం పైగా ఉండే ఇద్దరు వ్యక్తులనూ కల్పించాను. భాస్కరరావు అరణ్యానికి సరిపెట్టుకుపోయిన ‘వేదాంతి’. ఆఖరుకు తన వేదాంతాన్ని విసర్జించి మానవ ప్రపంచంలో పడుతున్నాడు. అందులో కథా నాయిక వంటి స్త్రీని నేనెన్నడూ చూడనిమాట నిజమే కాని ఇకముందు చూడనని భయం లేదు నాకు. మనో వైజ్ఞానికంగా ఆ పాత్రల నిర్మాణంలో తప్పున్నదని ఎవరైనా నిరూపించవలసి ఉంది. ఆ కథలో వచ్చిన మిగతా పాత్రలనన్నిటినీ నేను స్వయంగా చూశాను. చూడనివారి దృష్టికవి అసహజంగా కనిపిస్తే దానికి నేను బాధ్యుణ్ణి కాదు. ఆ కథ కంగారుగా ఉందన్నారు బుర్రా వెంకట సుబ్రహ్మణ్యంగారు. ఎందులో కంగారు? శిల్పంలోనా, భాషలోనా, భావనలోనా? ఆ కథ చదవగానే ‘ఇది జరిగి ఉండవచ్చును!’ అని అని పించే కథ కాదు ‘అరణ్యం.’ నా కథలు ఆ విషయంలో సహజంగా ఉండవని నేను ‘కారుణ్యం’లోనే మనవి చేసుకున్నాను. సహజంగా ఉండని కథ వల్ల ప్రయో జనం లేదని ఎవరు వాదించటానికి సాహసించుతారు. ‘కాకీనక్కా’ కథ సహజంగా ఉందా? నా వ్యాఖ్యానం తప్పుపట్టటానికి కాకుండా చదివినవారికి, ఆ కథ రాయటంలో నా అభిప్రాయం ఒకరి నీతి ఒకరికి వర్తించదని తెలియజేయటమేనని సులభంగా అర్థ మవుతుంది. నా ప్రయత్నం, మంచిదో కాదో, అందులో నేను సఫలుణ్ణి అయినానో కాలేదో చెప్పకుండా, విమర్శకులు నేను మరో పని ఏదో చెయ్యలేదని ఎంత రాస్తే ఏం లాభం?

‘ప్రేమ’ అనేది వాఙ్మయంలో బాగా ప్రవేశిం చింది. పూర్వులు ‘ప్రేమ’ అనేదాన్ని ఇప్పుడు మనం వాడుతున్న సంకుచితార్థంలో వాడేవారు కారు. వారు మోహమూ, కామమూ అన్న భావాల సమ్మేళనాన్ని మనం ప్రేమ అనటం ప్రారంభించుచున్నాం. కానీ భావి నాగరికతలో ఈ ప్రేమకు, వివాహానికి కొంత బాంధవ్యం ఏర్పడబోతున్నది. ‘సెంటిమెంటాలిటీ’తో కూడుకొని వివాహం గురించి ఒక కథ రాయాలని సంకల్పించుకున్న తరవాత దానికి పాత్రలను మన సంఘంలోనే కొంత వరకు పాశ్చాత్య నాగరికత అబ్బిన వ్యక్తులను తీసుకోక తప్పకపోయింది, ఎందుచేతనంటే మన పల్లెటూరి గ్రామాల్లో పాత సాంప్రదాయికులు చేసే వివాహాల్లో ‘సెంటిమెంటాలిటీ’ ఎప్పుడూ లేదు. అట్లా ఉండటానికి అవకాశం ఉండి కూడా లేకుండా జరిగిన వివాహాలకి పాత్రలు బి.ఏ. దాకా చదివిన బాల వితంతువు సుశీలా, మొదటినుంచీ బాహ్మ సామాజి

కుల ధోరణిలో పెరిగిన భద్రమూ, పార్వతీ నాకు దొరికారు. స్వగతపు ధోరణిలో రాసిన 'వరాన్వేషణ' అనే కథలో పార్వతీ, భద్రమూ బ్రాహ్మ సామాజికులు అని తెప్పించవలసిన అవసరం నాకు కనిపించలేదు. ఆ మాట చెప్పటంవల్ల ఆ కథ యొక్క శిల్పం బాగు పడి ఉండేదని ఎవరికైనా తోస్తే వారిది చదివి ఆ కథను మరింత బాగా ఆనందిస్తారని నమ్మటానికి నాకేమీ అభ్యంతరం లేదు. వారు పాశ్చాత్య సంప్రదాయాలు గమనించేవారు కావటమే నాకు అవసరమై ఉండింది. ఆ సంభాషణలో అసంతృప్తి చెందినవారు ఆ వాక్యాలలో కొన్ని చాలా భాగం ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకుంటే అంత అసహ్యంగా ఉండదని నమ్ముతున్నాను. ఆ పాత్రల సంభాషణాధోరణి మామూలు తెలుగు వాళ్ళు మాట్లాడినట్లు ఉండకూడదనే అభిప్రాయంలో ఆ సంభాషణ అట్లా రాయటం జరిగింది. ఇది ఇంగ్లీషు కథా అని అభిప్రాయం పడిపోయిన తరవాత పాఠకుడు లేనిచోట కూడా ఆ పాత్రల ప్రవర్తన పాశ్చాత్యుల ఆచారాలకు సరిపుచ్చాలని ప్రయత్నం చెయ్యటానికి వీలుంది. ఉదాహరణ: భద్రం సుశీలను పెళ్ళి చేసుకోమని అడగటానికి ఆమె ఒప్పుకోటానికి అనంతరం పాఠకుడు వారిద్దరూ ఎంగేజ్ అయినట్లు ఊహించుకుని కథను మరింత పాశ్చాత్యంగా చెయ్యవచ్చును. ఈవిధంగా కథలో ఉన్న దానికంటే ఎక్కువ ఊహించుకోకుండా ఉంచగలందులకే ఈ కథ ఇంగ్లీషు కథ కాదు. అనుకరణ కూడా కాదని మనవి చేశారు. అప్పటికీ నామాట నమ్మని వారిని నేనేం చెయ్యగలను? 'దైవమిచ్చిన భార్య' అని వెంకటచలం గారు 'Passionate Friends' అనే H.G. Wells నవలను అనుసరించి రాస్తూ ఆ గ్రంథంలోనే అది అనుకరణ అని తప్పుకున్నారు. దాన్ని విమర్శిస్తూ ఒక విమర్శకుడు "ఇది అనుకరణం, ఆ మాట దాచిపెట్టారు' అంటే వెంకటచలంగారు ఏం చేశారు కనకా?

స్వగతంలో మూడు కథ 'కాలభైరవుడు.' ఇందులో ఉన్న కథలన్నిటిలోకి నా అభిప్రాయంలో ఇది ఉత్కృష్టమైనది. దీనికి ఒక నీతి ఉందనేకాదు. ఇటువంటి కథ రాయటం సులభం కాదు. నేను మళ్లీ ఇటువంటి కథ ఇంకొకటి రాయటానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేను. ఇందులో ఉన్న ముఖ్యపాత్ర ఒక కుక్క. (దీనికి శ్రీనివాసరావు కథానాయకుడని భ్రమపడవలసిన అగత్యం లేదు. ఇది 14 పేజీల కథ. నాలుగో పేజీలోనే కుక్క విషయం వచ్చింది.)

ఇతర కథలలో ముఖ్యపాత్రను ప్రవేశపెట్టినట్లు కాకుండా ఈ కుక్కను ఈ కథలో పాఠకులకు ప్రవేశపెట్టడంలో కొంత తెలివితేటలు వినియోగించగలిగానని అనుకుంటున్నాను. కథ చదివేటప్పుడు పాఠకుడు కథలో పాత్రలలో దేన్నో ఒకదాన్ని నమ్మలేకపోతే చాలా ఇబ్బంది ఉంది. ఈ కథలో ఉన్న విషయం పాఠకులు సులభంగా నమ్మజాలనిది. శ్రీనివాసరావు శాస్త్రీయమైన శోధన చెయ్యటానికి ఉద్యుక్తుడై నా మూఢ విశ్వాసపరుడు. ఆ కుక్కే 'ఆదినారాయణ' అనే అభిప్రాయం అతనికి ఎప్పుడో పడిపోయింది. కనక ఆ పాత్రవల్ల పాఠకులకు ఏమాత్రమూ లాభంలేదు. అందుకని పాఠకులను నమ్మించగల మరొక పాత్రను ప్రవేశపెట్టాను. అతనే కథ చెబుతాడు. ఆ కుక్క 'ఆదినారాయణే' అని అతనెప్పుడూ నమ్మలేదు. కాని ఆ కుక్క సామాన్యమైన కుక్క కాదనీ, దానికి మనిషిని అర్థం చేసుకునే శక్తి ఉందనీ అతను నమ్మగలిగాడు. పాఠకులు కూడా అంతవరకు నమ్మాలి. అది నమ్మిన తరవాత మిగిలిన కథ సులభంగా అర్థమౌతుంది. తనకు ప్రసాదించబడిన అసామాన్యశక్తిని వినియోగించి మానవుణ్ణి వంచించాలని చూసింది. మానవత్వానికి కొద్దిపాటి అర్హతగల తను దేవత్వానికే గాలం వేసింది. మానసికంగా అది దాదాపు మనిషి అయినా శారీరకంగా అది కుక్క మాత్రమే. తన శునకత్వాన్ని దాచాలని అది చేసిన ప్రయత్నం ప్రకృతి విఫలం చేసింది. ఆ కుక్కకు రుగ్మత ప్రారంభమయింది. మానవులను వంచించిన ఆ కుక్క తన biology జయించలేక దొంగ వేషాలు ప్రారంభించింది. కొన్నిసార్లు పట్టుబడ్డదికాని దాని శునకత్వాన్ని బయటపెట్టడానికి మూడలోకానికి సాహసం చాలకపోయింది. ఆఖరుకు దేవత్వం ఆ కుక్కకు ఒక పెద్ద తద్దినమయింది. ఆ కుక్క తన భక్తులను నడిసముద్రంలో

ముంచి తన శునకత్వం సార్థకం చేసుకోటానికి పరారి అయిపోయింది. అది ఒక ఆడకుక్క వెంట పోతూం డగా ఒక ఆసామి చూసినప్పుడు దాని ఆరోగ్యం చాలా బాగుపడి ఉంది. తనకు ఉన్న కొద్దిపాటి శక్తితో సాధించ దగినదానితో తృప్తిపడక అధికమైన దానికి ఆశించి ఈ ప్రయత్నానికి అడ్డువచ్చే తన ప్రకృతిని అణచిపెట్టాలని ప్రయత్నించి దెబ్బతిని ఆఖరుకు తనకు ప్రసాదించ బడిన కించిత్తూ విసర్జించి ప్రకృతికి వశుడైన నిర్భాగ్యుడు ఈ ప్రపంచంలో అక్కడక్కడా కనిపిస్తూ ఉంటాడు. సన్యాసం పుచ్చుకుని తిరిగి కాపురం పెట్టిన వారందరికీ ఈ కథలో ఉన్న నీతి అర్థమవుతుంది. కొందరు సన్యాసులు చాటుగా చేసే దురాగతాలను పాపభీతి చేత కప్పిపెట్టేవారికి కూడా ఈ కథనించి నేర్చుకోవలసింది కొంత ఉంది. మానవత్వం పరిపూర్ణం చేసుకోగలిగిన మానవుణ్ణి మెచ్చుకోలేని లోకం, కొంచెం మానవత్వం చూపిన పశువుని దైవంకింద ఆరాధించ టానికి సిద్ధపడుతుంది. జీవితంలో ఇటువంటిది జరిగితే అది మౌఢ్యం అనిపించదు. అందుకని ఈ కథలో ఉన్న కుక్కను దేవుడుగా భావించక దాన్ని శాస్త్రీయంగా విమర్శించగల మనుష్యులను ఇద్దరిని ఉంచాను. అందువల్ల 'భక్తుల' అవివేకం స్పష్టంగా తెలిసి రావటానికి అవకాశం ఉంది.

ఈ 'కాలభైరవుడు' ఇంత అసహజంగా కనిపిస్తు న్నప్పటికీ నేను రాసిన కథలలో ఇంతకంటే సహజమైన కథ లేదు. ఎందుచేతనంటే ఈ కథ చాలా వివరాలతో సహా నిజంగా జరిగింది. కాని నిజంగా జరిగినప్పుడది కుక్క కాదు ఎద్దు. ప్రత్యక్షంగా జరిగినప్పుడీ కథకి నీతి లేదు. నీతి నేను స్వయంగా కల్పించాను.

'ఇంతలో ఉంది' అనే కథ 'పశ్చాత్తప్తుడు' అనే కథ మాదిరిగానే చెప్పదగిన విశేషం అట్టేలేనిది. ఈ రెంటిని గురించి వ్యాఖ్యానం కూడా అనవసరంగా రాశాను. వాటిల్లో ఉన్న విషయం అంత విదితంగా ఉండి ఉండటంవల్ల కాదుకద, బుర్రా వెంకట సుబ్రహ్మణ్యంగారికా రెండు కథలూ కొంతవరకైనా నచ్చింది?

ఇక మిగిలిన 'అశోకవనం.' నేను ఈ కథ రాయ టంలో రామాయణాన్ని తిరగరాశాను. 'ప్రతి తరం లోనూ చరిత్ర తిరగరాయవలసి ఉంటుంది,' అని ఒక పెద్దమనిషి అన్నాడు. నేను పురాణాలను చరిత్రగానే భావిస్తూ వస్తున్నాను. నేను వాటిని అంతవరకన్నా విశ్వసించినందున నన్ను ఎగతాళి చేసిన వారున్నారు. ఈ రామాయణ భాగాన్ని తిరగరాయబూనినప్పుడు నన్ను నేను వాల్మీకిలోగాని, నాకంటే ముందే 'అశోకం' రాసిన ముద్దుకృష్ణగారితోగాని పోల్చుకోలేదు. వాటితో కొంతవరకు అసంతృప్తి చెందటంవల్లనే నేను మరో 'అశోకవనం' అంటూ రాశానని సులభంగా ఊహించ వచ్చును. నా అసంతృప్తికి కారణాలు నా అశోకవనం వేళాకోళానికి కాకుండా చదివినవారికి ఎవరికైనా సులభంగా అర్థమై ఉండును. వాల్మీకి రామాయణం మార్చి ఇంకొక రామాయణం రాయటం నా పని అయినట్టయితే, రాముడికి సీతకూ అన్యాయం చెయ్యటమే నా పని అయినట్టయితే రాముడు రావణుడి చేత చచ్చినట్టూ, సీత రావణుడి భార్య అయినట్టు రాసి ఉండును.

రావణుడికి విమానం ఉండేదని. ఒక కోతి సముద్రం లంఘించిందని అనుకోవటం వల్ల నా సంస్కారానికి జరగని అవమానం. రావణుడు సీతను లంకలో ఖైదు చేశాడనీ, రాక్షస స్త్రీలను ఆమెకు పోలీసు లుగా పెట్టాడనీ, రాముడు లోకోపకారార్థం వాలిని చాటుగా నుంచుని కొట్టాడనీ, శూర్పణక ముక్కు చెవులు కొయ్యటం లక్ష్మణుడికి ధర్మమేననీ విభీషణుడు భ్రాతృద్రోహి కాడనీ అనుకోవటంవల్ల కలుగుతున్నది. రావణుడు సీతను చెరచదలిచినట్ట యితే సీతకు దిక్కెవరు? రాక్షసులను కాపలా పెట్టక పోతే సీత ఎక్కడికి పారిపోగలదు? ఆమె భర్త కోసం తపించి ఆత్మహత్య చేసుకొనేటంతటి పతివ్రత అయితే ఆమె చావువల్ల రావణుడికి ఏం నష్టం? ఏ విధంగానూ మృత్యువుకు లొంగని రావణుడికి నలకూబరుడి రూపంవల్ల హాని కలుగుతుందనుకోవటంకంటే, ఒకసారి రంభను చెరిచిన రావణుడికి అటువంటి పని యొక్క హైన్యము తెలిసి వచ్చిందనుకోవటం సహజం కాదా?

వేదవిభజనచేసి నాలుగవ బ్రహ్మ అనిపించుకున్న రావణబ్రహ్మ సీతను తీసుకొని వెళ్లిన రావణుడు కాదనుకున్నప్పటికీ, ఈ రావణుడు ఆర్యుడు కాడని చెప్పటానికి ఆధారం లేనిమాట నిజమే. కాని రాక్షసులు ద్రావిడులు కారని వాదించటానికి ఆధారం ఏముందో నేనెరగను. రావణుడు ఆర్యద్వేషి అనేది నిశ్చితం.

రావణుడికి నేను చేసిన న్యాయం ఎవరైనా చెయ్యవలిసే ఉంది. అతనికి సీతమీద భ్రమపోలేదని నేననలేదు. రావణుడికి న్యాయం చేసే ప్రయత్నంలో సీతకుకాని రాముడికికాని అనవసరమైన అన్యాయం జరిగి ఉంటే అది నా తప్పే. సీతవంటి భర్తృపర అశోకవనంలో సీత మాదిరిగా ప్రవర్తించటం అసహజం కాదు. ఆమె అప్పటికే లక్ష్మణుడి మీద మోపరాని నింద మోపి వుంది. రావణుడు తనను లంకకు చేర్చడంతో రాజకీయాలకుగల సంబంధం ఆమెకి తెలిసి ఉంటే లంకలో ఆమె అంత భేదించి వుండదు. ఆమె ఎంతో సేపటికి తనకు గలిగిన భర్తృ వియోగాన్నే అర్థం చేసుకుంది. నా కథలో సీత తనంతట తాను బంగారు మేడల్లో వుండాలని వాంఛించినట్టు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఆ మేడలో కంటె అశోకవనంలో ఎక్కువ హాయిగా ఉంటుందని ఆమెకు తట్టకపోవటం నాకు సహజంగానే ఉంది. ఆమె లంకలో ఉన్న కాలంలో ఒక్కసారయినా కన్నెత్తి అశోకవన సౌందర్యానికి ఆనందించినట్టు మనకు నిదర్శనం లేదు. నేను సీతను రావణుడితో ధాటీగా మాట్లాడగల ధైర్యంతో కూడుకున్న మనిషగానే చిత్రించాను. ఇక రాముడికి నేను ప్రత్యేకించి చేసిన అన్యాయం ఏమీలేదు. ఆ కథాధోరణిలో సందర్భానుసారంగా రాముడు చేసిన పనులు చెప్పిన మాత్రానే రాముడి తత్వం నూతన దృష్టిలో కనిపిస్తుంది. .

రామాయణ కథ వల్ల నా సంస్కారానికి అవమానం జరగకుండా ఉండాలంటే నేను అనుకున్న భాగంలో ఏయే మార్పులు చెయ్యవలసి ఉంటుందో అన్ని చేశాను. అందువల్ల ఎవరెవరి సంస్కారానికి ఎటువంటి హాని కలగగలదో ఊహించగలగటం అసంభవం. రచయిత ఇటువంటి విషయాలలో తన వికాసాన్ని ఆధారం చేసుకుని రచన సాగించవలెనే కాని మార్గాంతరం లేదు. ఆ మార్గాంతరమేదో నే నెరగను.

కథాశిల్ప కారణాల ననుసరించి అశోకవనానికి ఈ కథలో ప్రాముఖ్యం కొంత ఇవ్వవలసి వచ్చింది. రావణుడికి అశోకవనం మీద కల ప్రేమకు మొహం మొత్తేవారికి సీతకు రాముడిమీద గల అపారప్రేమ మొహం మొత్తదని గ్యారంటీ ఏమిటి? లంకలో ఒక అశోకవనం ఉండటమే రావణుడి సౌందర్యపిపాసను సూచిస్తున్నది. ఈ పిపాసలకు సంస్కారి వెగటు చెందడు. నా ప్రత్యేక పిపాస సంగీతానికి సంబంధించినది. నాకు సంగీతం మీద కల అభిరుచిలో నా రావణుడికి అశోకవనంమీద నూరోవంతు మోజు కూడా నేను సూచించలేదు. ఈ సంగతి తెలిస్తే బుర్రా వెంకటసుబ్రహ్మణ్యంగారు నా పేరు విన్నప్పుడల్లా ఎంత వెగటు చెందుతారో!

***ఒక చచ్చు గ్రంథంలో లోపాలేవీ పట్టటానికి వీలుండక పోవచ్చును, మరొక తెలివైన గ్రంథంలో పురుగేరటానికి లక్ష అవకాశాలు దొరకవచ్చును. విమర్శకులు వాటి మీద విరుచుకునిపడటం కంటె ఉచితం కాని సంగతి వుండబోదు.***



ఇతర విమర్శనల సంగతి నాకు బాగా తెలియదుకాని ప్రస్తుతం కథకులు ఒకరినొకరు విమర్శించవలసినవారు కావటం కొంత దరిద్ర హేతువుగా ఉంది. (అదృష్టవశాత్తు నేను మాత్రం విమర్శకుణ్ణి కాను. సుబ్రహ్మణ్యంగారు అభిప్రాయపడ్డట్టు నా వంతు ఎప్పుడన్నా ఎవరన్నా మెచ్చుకోవటమే. నా మెప్పుకు చాలా పాత్రులైనవారిలో బుర్రా వెంకటసుబ్రహ్మణ్యంగారు కూడా ఒకరు. వారి విమర్శను బట్టి వారి కథలను కొలవటానికి లేదు.)

ఈ విమర్శకులు స్వతంత్ర రచనలకు అలవాటు పడినవారు కావటంచేతను ఆ విమర్శలు స్వతంత్ర వ్యాసాలుగా పరిణమించి అందులోకి వారి వ్యక్తిత్వం

రాతగినదానికంటే సుమారు పదింతలు అధికంగా వచ్చి, విమర్శించబడే గ్రంథమూ, తత్కర్తా ఎటో అణగి పోతాడు.

విమర్శలు ప్రకటించే పత్రికల అజ్ఞానానికి కూడా మేర ఉన్నట్టు కనిపించదు. అది ఉదహరించటానికి నామీద 'ప్రతిభ'లో చేసిన ప్రతికూల విమర్శను తీసుకో వటం ఏమీ బాగాలేదు కాని ప్రస్తుతం నాకు అందు బాటులో అంతకంటే మంచి ఉదాహరణ లేదు. (ప్రతిభ అంటే నవ్యసాహిత్య పరిషత్పత్రిక.) అందులో రా.సు.గారు స్వగతాన్ని గురించి చేసిన విమర్శలో కొన్ని వాక్యాలు ఎత్తి చూపిస్తాను.

"అసలు కథాసంపుటికి స్వగతం అనే పేరు సరిపోవడం లేదు." కారణం ఊహ్యం.

"వరాన్వేషణలో భద్రం సుసీని ఎప్పుడూ పెళ్లి చేసుకోవాలి అని అనుకోలేదట. కాని ఆమె సాంగత్యం మాత్రం అతనికి ఆనందం కలిగించేదట . అకస్మాత్తుగా భద్రానికి అవేశం పుట్టి చటుక్కున ఆమెను కొండలన్నీ మారుమోగేటట్టు ముద్దు పెట్టుకున్నాడు. పాపం మొదటిసారి కాదూ!" -ఆ కథను గురించిన విమర్శ అంతా కలిపి యిదే!

'అశోకవనం' మీద విమర్శ- 'అశోకవనం'లో లంకలో వున్న రాక్షసులంటే కథకుని ఉద్దేశం ద్రావిడు లని; రావణుడు పెద్ద 'కళావంతుడట!'

'పశ్చాత్తప్తుడు' అనే కథలో పశ్చాత్తాపం ఎవరిది? -ఈ సందేహం నివారణ కాలేదీ పెద్దమనిషికి.

"విమర్శకులెవ్వరూ తన కథలలో ఉన్న స్వారస్యాన్ని బయటపెట్టడం లేదని ఈ కథకుడు స్వయంగా తన గ్రంథాన్ని ప్రశంసించుకొన్నాడు" - అని రా.సు. ఊహించుకున్నాడు!

ఇంతేకాదు! మరొక ముఖ్య విషయం- ఒక పత్రికలో రెండు గ్రంథాలు విమర్శించబడితే ఆ విమర్శ లను బట్టి వాటి తారతమ్యం గ్రహించేటందుకులేదు. ఒక చచ్చు గ్రంథంలో లోపాలేవీ పట్టటానికి వీలుండక పోవచ్చును, మరొక తెలివైన గ్రంథంలో పురుగేరటానికి లక్ష అవకాశాలు దొరకవచ్చును. విమర్శకులు వాటి మీద విరుచుకునిపడటం కంటె ఉచితం కాని సంగతి వుండబోదు. నా వ్యాఖ్యానంలో నేను మనవి చేసిన విషయమే అది. "మనకు అవసరం లేని వస్తువును గురించి గంటసేపు బేరం ఆడం!... నాకు అవసరంలేని కథలో శిల్పం వుంటే నాకేం లేకపోతే నాకేం? భాష బాగుంటేనేం? అసహ్యంగా ఉంటేనేం?" అవి నా మాటలు. తెలివితేటల్లో రచన ఏ తరగతికి చెందు తుందో, అందువల్ల ఎవరికికాని ఏ కించిత్తుగానీ అవసరం వుండటానికి వీలుందోలేదో ఏమాత్రమూ నిర్ణయించలేకపోగా 'రావణుడు కళావంతుడుట!' అని ఆశ్చర్యపడితే విమర్శన అవుతుందా?

జన్మలో ఎన్నటికీ అవగాహనకాని అస్పష్టమైన ఆధారాలను పట్టుకుని వేళ్లాడే వ్యక్తులకు తమ రచనలవల్ల వెంటనే ప్రజలకు జరుగుతున్న లాభ మేమిటో అర్థం కావడానికి అవకాశంలేదు. పది సంవ త్సరాల క్రితంకంటె యిప్పుడు తెలుగులో ఎక్కువ తెలివైన సంభాషణ జరుగుచున్నదని నేను కళ్లారా చూసి నమ్మగలుగుతున్నాను. ఇప్పటి సాహిత్యం వల్ల యిటువంటి వుపకారం జరుగుతూ వెళ్లటానికి ఏ విధమైన ఆటంకమూ అవసరంలేదు. ఈ తెలివితేటె లను మనం రచనలో వినియోగపరచినట్లు విమర్శన లో వినియోగపరచలేకుండా వున్నాం . దానికి కారణ మేమంటే స్వతంత్ర రచన చేసేవాడు తన తెలివితేట లను స్వేచ్ఛగా వెళ్లనివ్వవచ్చును. అతనికి ఆ వ్యాపారం లో మరొక వ్యక్తితో ప్రమేయంలేదు. కాని విమర్శకుడు ఒకవైపు రచయితను- వివిధ రచయితలను అర్థం చేసుకోగలవాడై ఉండాలి. మరొకవైపున ఆ రచన యొక్క ఫలం ,అనుభవించేవారి మనఃప్రవృత్తి అర్థం చేసుకోగలవాడై ఉండాలి. విమర్శ వల్ల ప్రయోజనం వుండాలంటే దీనికి కూడా ఒక ఉదాహరణ చూడండి.

గొప్ప రచయితలమనుకునే వారంతా తెగతిట్టే ఒక పత్రిక వేలకు వేలు అమ్ముతుంది. అటువంట ప్పుడు వీరి తిట్లు వీరి vanity తృప్తిపరచటానికే అవుతూ ఉంటుంది. అటువంటి గతి ఉత్తమ తరగతి విమర్శ కులకు పట్టకుండుగాక అని నా ఆశ!

*భారతి, ఫిబ్రవరి 1938*

# Vadilal
## Ice creams

# రుచికరమైన అనుభూతి

• • •

Relish the most authentic Indian treats from Vadilal,
a brand with a 100-year-old legacy of
serving goodness and happiness.




Made From 100% Milk

NO EGGS.
NO PRESERVATIVES.
NO ARTIFICIAL FLAVORS.

అట్టాడ అప్పల్నాయుడు

> జజ్జనకరి జనారే ఝణకు ఝణా ఝణారే
> జజ్జనకరి జజ్జనకరి ఝణకు ఝణా ఝణారే
> పూటపూట పస్తులతో – పుస్తకాలు చదివినోడ
> ఫీజుకట్టటానికేమొ – పీకులాట పడ్డవోడ
> కాలు పట్టి ఏలు పట్టి – కాలేజీలో చదివినోడ
> గోల్డుమెడలు కొట్టినోడ – గోడకు దిగ్గొట్టితివా
> ఇప్పటికీ ఎప్పటికీ ఈ పాట మ్రోగుతూనే ఉంటుంది!

# పండు రాలిపోయింది... పాట మిగిలింది!



***'ఏం పిల్లో ఎల్దమొస్తవా' అంటూ ప్రజలను ఉర్రూతలూగించిన ఉత్తరాంధ్ర జానపద శిఖరం, ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు ఆగస్టు 4 తెల్లవారుజామున విజయనగరం జిల్లా పార్వతీపురం పెదబొండపల్లిలోని తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూశారు. 1972లో జననాట్య మండలిని స్థాపించి... తన జానపద గేయాలతో పల్లెకారులతో పాటు గిరిజనులను వంగపండు ఎంతగానో చైతన్యపరిచారు. పదునైన పదాలకు సొంపైన బాణీలతో స్వయంగా కాలికి గజ్జెకట్టి ఆడి పాడే వంగపండు శ్రీకాకులం రైతాంగ పోరాటం నుంచి ఉద్భవించిన వాగ్గేయకారుడు. ఏం పిల్లడో ఎల్దమొస్తవ పాటతో వంగపండు ప్రఖ్యాతి చెందారు. అర్ధరాత్రి స్వతంత్ర్యం సినిమాతో వంగపండు సినీ ప్రస్థానం మొదలైంది. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే కళారత్న పురస్కారం అందుకున్నారు.***

స్విచ్ఛ్ వేస్తే తీగలోకి విద్యుత్ ప్రవహించినట్టు...ఆ పాట వింటే శ్రోత నరనరానా ఉత్తేజం కలుగుతుందని రాచకొండ అలనాడెపుడో అన్నారు. అదిగో ఆ ఉత్తేజ ప్రసార వాగ్గేయకారుడు వంగపండు అకస్మాత్తుగా పాటను మనకొదిలేసి వెలిపోయేడు. రాచకొండనిగానీ కలస్తాడో...యేటో?

వంగపండు అమాయక జానపద ఎఱ్ఱజెండా! అమాయకుడు గనకనే... 'యేమ్ పిలడో, యెల్దు మొస్తవా! సికాకుళంలో సీమకొండకీ. సిలకలు కత్తులు దులపరిత్తయని, సెమర పిల్లులు శెంఖ మూదునని, ఎలకలు పిల్లులు యెంటదగులు'నని పిలుపిచ్చాడు. గడుసోడయితే ఆ పిలుపిత్తాడా ఆ రోజుల్ల? అప్పుడుకి సిలకల రెక్కలిరిగి, ఊపిర్లాగి నేల కొరిగినాయి. పిల్లులు మాటుగాసి యెలకల్ని ఏటాడి కొన్నిట్ని సంపినాయి. మరికొన్నిట్ని బోనుల్ల బంధించినాయి. ఆకు తెంపితే ఆదివాసీ నెత్తురు సుక్కలుసుక్కలుగా కారుతన్న రోజులవి. కోరన్న, మంగన్న నుంచి కొండ కొండన ఎఱ్ఱజెండా యెగరేయించి జరుగుబాటు కోసం తిరుగుబాటు నేర్పిన గురువులుదాకా యెందరో వొరిగిన సమయమది. ఒకసేత గూడేలు కాల్సిన పాలకులు మరోసేత పథకాల వొంటకాలు పంపకం సేస్తన్న సమయమది. జెండా పీలికలు పీలికలయ్యింది. ఏ పీలిక యెవుళి సేతిలుందో? యెవులే పీలికకి లీడరో? ఏ లీడర్ రోడ్ యెటు తీసకపోతాదో అంతా తికమకమకతికగ ఉన్న సమయాన తికమకలూ, మకతికల్లేకండా వొంగపండు శికాకుళం యెళ్దుమొత్తవా అని పిలుపిస్తూ శికాకుళం బయలెల్లిపోనాడు! సుత్తీకొడవళి గురుతుగ ఉన్న ఎఱ్ఱనిజెండా... ఎగురుతున్నదీ, ఆకాశాన అరుణబింబమై... పీడిత జెనాల కండ దండగా అని ఎఱ్ఱజెండా పాటెత్తుకున్నాడు.

జానపదుడు కాబట్టే... జానపదుల ఇళ్లల్ల, కూలోళ్ల పిల్లల నోళ్లల్ల వినబడే పలుకుబళ్లని తప్పా సంధులూ, సమాసాలూ, సంస్కృత పదబంధాల సరస్వతుల పలుకులు వినలేదు. అటువేపు కన్నెత్తి చూడలేదు. వాసన అయినా మూచూడలేదు. పాటల్లోనే కాదు అతని మాటల్లోనా జానపదుల పలుకు

తప్పా నగరీక పలుకుబడి వినబడదు. అపారమైన జానపద కళాసంపదలని కంటితో చూసి, చెవితో విని, మనసుతో ఆస్వాదించి, గుండెల నిండా నింపుకున్నాడు. పాటకు బాణీలు యే సంగీత విద్వాంసుని దగ్గిటో నేర్చుకోలేదు, జెనమే సకల కళావిద్వాంసులని చిన్నప్పుడే తన పల్లెప్రజలను చూసి తెలుసుకున్నాడు. ఉడుపు మళ్లల్లో వినిపించే ఉడుపుగత్తెల నోమీనో మన్నలు, పశులకాపర్ల గొంతులు తెగే పద్యరాగాలు... బాల్యంలోనే వంగపండు వొంటిని పట్టేయి. భజన బృందాల దగ్గర భక్తిగీతాలు విని... బతుకు గీతాలు రాయడం నేర్చుకున్నాడు. తండ్రి, తనెరిగిన పెద్దలూ ప్రదర్శించే బుర్రకథలు, భాగోతాలు చూసిచూసి తనదైన బాణీలో బుర్రకథలూ, బాగోతాలూ రాయడమారంభించాడు.

బతుకుతెరువు కోసం ఐ.టి.ఐ చేసి విశాఖపట్నం చేరాడు. పల్లె రైతు బతుకు నుంచి పట్నపు కార్మిక బతుకులోకి వొచ్చేడు. కార్మిక గీతాలు రాయడం, పాడడం... అలా పుట్టిందే  సుత్తీకొడవళి గురుతుగ ఉన్నా ఎర్రని జెండా పాట.

తొలిసారిగా అట్టడుగు జనం పలుకుబళ్లతో పాటను రాసేడు వంగపండు. పాడేడు. కార్మికగీతాలతో విశాఖలో మార్మోగిన వంగపండు గొంతు తొలిసారిగా- తన బంధుబలగం, తన గ్రామీణ జెనం బతుకుల గురించి, తను పుట్టి పెరిగిన ప్రాంతపుపట్నం పార్వతీపురంలో- వొత్తన్నాడొత్తన్నాడు... ఆ భూములున్న బుగతోడు, పోలీసుల తోడుతోను, అడుగడుగో అటుసూడు... అని చేత చిరతలతో, కీచు గొంతుతో వేలాది జనానికి వినిపించేడు. వేలాది జనం ఆరోజు మహాకవి శ్రీశ్రీ కోసం వచ్చేరు. జనం వంగపండు పాటకు వన్సమోర్ కొట్టేరు. శ్రీశ్రీ  ఇప్పుడు కావాల్సిన కవిత్వమిదీ అని వంగపండుని పొగిడేరు. అమాయక జానపదుడు ఈ  పాట జనానిది అనన్నాడు. పాటల నిండా జనం బతుకులు నింపేడు. జానపదుల కళాత్మకత అంతా పాటల్లో పొంగించేడు.  జానపదు లకు సాధ్యం కాని సామాజిక విశ్లేషణాశక్తి వంగపండుకి ఎర్రజెండా వొల్ల అలవడడం వొల్ల కేవళం తమ అనుభూతులనూ, అనుభవాలనూ, ఆసక్తులనూ పాడుకొనే, అతీతశక్తుల పొగడుకొనే జానపద కళాకారులకంటే అభ్యుదయ పథగామి అయ్యాడు.

అమాయకత్వం, జానపదం, ఎర్రజెండా వొదలని వొంగపండు ఇటు పట్నం, అటు పల్లె జీవితాల మీద పాటలు రాసేడు. మాలపేటని కళ్ల ముందర పెట్టేడు. కూలోళ్లపిల్లని లోకానికి చూపేడు. ఎన్నెలని అంతకు మునుపు కవులు ఎవురూ పలకరించని పల్లె బతుకు లోంచి పలకరించేడు. మడిలో బెడ్డలన్ని- నీ నెత్తురు గడ్డలూ, పండిన పంటలన్ని నీ సెమటా సుక్కలని రైతోడికి ఎరుకపరిస్తే; ఎంత్రమెట్టా నడుస్తు ఉందంటే... వోరన్నోలమ్మీ అని యంత్ర గమనాన్ని అద్భుతంగా వినిపించేడు. వంగపండులో మరో గొప్పదనం ఏమంటే పాట వస్తువుకు తగ్గ బాణీని ఎన్నుకోవడం. యంత్రం గురించి పాట యంత్రం కదిలే తీరులో బాణీ ఉంటుంది. వోడా నువ్వెళ్లిపోకే... మా కండలన్ని కరగదీసి, నీటిలోన కోటలాగ నిన్ను కట్టినామన్న పాట గూడా... నీటిలో కదలాడే వోడను తలచుకు దుఖించే కార్మిక శోక ఆలాపనా బాణీలో ఉంటుంది. ఇక పోరు పాటలైతే... ఉరికిస్తాయి. తుపాకి రాజ్యంలోరన్నా- నువ్వు తుఫానువై లేవరన్నా, జజ్జనకరి జనారే; నీయమ్మ జచ్చినా దమ్మిడొగ్గనూ... నీ అయ్య జచ్చినా దమ్మిడొగ్గనూ... అనేక పాటలు వస్తువూ, బాణీల మేలు కలయికలకు ఉదాహరణలుగా చెప్పొచ్చు.

వంగపండు విశిష్టతకు ఓ గొప్ప ఉదాహరణ భూమి బాగోతం నృత్యనాటక రచన, ప్రదర్శన. భూమి బాగోతం వలన నాయుడూ, కరణాలు అనే గ్రామీణ పీడక ఉద్యోగాలు ఊడిపోయాయి. తెలుగునేల అశేష పల్లెల్లో అనేక బృందాలు భూమి బాగోతాన్ని ప్రదర్శించాయి. ఇంత విస్తృతంగా ప్రదర్శనలు పొందిన కళా రూపం ఇటీవల మరొకటి లేదు. శ్రీకాకుళ పోరాటాన్ని తనదయిన బాణీలో శిక్కోలు యుద్ధం పేరుతో కంజరి కథ; కాళీపట్నం రామారావు గారి ప్రసిద్ధ కథ 'యగ్యం' కంజరి కథగా రాసి ప్రదర్శనలు ఇచ్చాడు.

వంగపండు వాగ్గేయకారుడుగా ప్రసిద్ధుడైనందున అతను కొన్ని కథలూ, నాటకాలూ రాసినా ఆ ప్రక్రియల్లో అంతగా పేరు రాలేదు. అపార కళా సంపదను లోకానికి అందించి- వంగపండు అతి పేదగా జీవించి మరణించాడు.

(వంగ)పండు రాలిపోయిందిగానీ పాట లోకాన మిగిలే ఉంది. యెప్పటికీ మిగిలివుంటుంది. ❀

# తెలుగువారి 'బంగారు కొండలరావు'



***ఆయనో సినీ విజ్ఞాని. స్క్రీన్ ప్లే, కథ, కథనాలు, పాతతరం నటన- ఏ విషయంలోనైనా ఆయనకు న్న పట్టు వేరొకరికి లేదనేది సినీ ప్రముఖుల మాట. అందుకే ఆయనను చాలామంది సినీ ఎన్‌సైక్లోపీడియా అని అంటుంటారు. పాత్రికేయుడిగా, రచయితగా, సహాయ దర్శకుడిగా, కారెక్టర్ ఆర్టిస్టుగా- ఇలా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనే సీనియర్ నటుడు రావి కొండలరావు. జులై 28న తన 88వ ఏట హైదరాబాద్‌లో మరణించారు.***

నటులుగా, నాటక ప్రయోక్తగా, రచయితగా ఏడు దశాబ్దాలకు పైగా తెలుగువారిని రంజింపచేసిన ఆత్మీయులు రావి కొండలరావు.

రావి కొండలరావు 1932 ఫిబ్రవరి11న జన్మించారు. అనకాపల్లి, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళంలో పెరిగి పెద్దయ్యారు. తన పదహారో ఏట చిల్లర డబ్బులు జేబులో వేసుకుని, నటుడు కావాలని రావి కొండలరావు మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగాడు. అక్కడి నుంచి పాత్రికేయుడిగా, రంగస్థల, సినీ నటుడిగా, సినీ రచయితగా ఆయన జీవిత ప్రస్థానం సాగింది. నాగావళి నుంచి మంజీరా వరకు సాగిన ఆయన తన ప్రస్థానాన్ని 'నాగావళి నుంచి మంజీరా వరకు' పేరిట ఆత్మకథగా రచించారు.

బాల పత్రికతో రావి కొండలరావు రచనా వ్యాసాంగం ప్రారంభమైంది. మద్రాసు నుంచి వెలువడే ఆనందవాణికి సంపాదకత్వం వహించారు. 1958లో శోభ సినిమాలో తొలి వేషం వేశారు. సుమారు 600 సినిమాల్లో నటించారు. బాపు దర్శకత్వంలో రూపొందిన పెళ్లి పుస్తకానికి, రావి కొండలరావు రాసిన కథకు స్వర్ణ నంది బహుమతి లభించింది.

1975లో 'వనిత' పత్రిక ప్రారంభించినపుడు ఆ సంపాదకవర్గంలో చేరారు. 'వనిత' 'విజయచిత్ర' పత్రికల పనిలో భాగస్వామి అయ్యారు. అటు సినిమాల్లో నటిస్తూ ఇటు పత్రికల్లో పనిచేస్తూ ఆ రెండు పాత్రలనూ విజయవంతంగా నిర్వహించేవారు. 'వనిత' కోసం 'బామ్మగారి పేజీ' రాసేవారు. 'విజయచిత్ర' పత్రికలో సంపాదకీయాలు, పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు, ప్రముఖులతో సంభాషణలు, సంగీతానికి సంబంధించిన 'స్వరధుని' వ్యాసాలు- ఇవన్నీ ఒక పార్శ్వమయితే, నాగయ్యగారి జీవితచరిత్ర, పాత తెలుగు చిత్రాలను వాటిని చూస్తున్న అనుభూతి కలిగించేటట్టు సాగిన సమగ్ర చిత్ర రచనలు మరొక పార్శ్వం.

మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో తెలుగు నాటకాల విభాగంలో కొండలరావుగారు, రాధాకుమారి గారు ఎన్నో నాటకాలలో పాల్గొన్నారు. ఆయన రేడియో కోసం రాసిన 'ఉద్యోగమే మహాభాగ్యం' నాటకం కథతో ఆ తర్వాత 'పెళ్లిపుస్తకం' చిత్రం రూపొందింది.

మద్రాసులోనే కాక హైదరాబాదులోనూ ఆకాశవాణి నిర్వహించిన ఉగాది కార్యక్రమాలలోనూ పాల్గొని వాటి వన్నెనూ వాసినీ పెంచారు కొండలరావు. కొండలరావు రాసిన ఎన్నెన్నో నాటకాలు, 'బ్లాక్ అండ్ వైట్' పేరిట వచ్చిన వ్యాసాలు, మాయాబజార్, షావుకారు చిత్రాలకు సంబంధించిన సమగ్ర రచనలు, సినిమాలు ఎట్లా తీయాలో ఎట్లా తీయకూడదో వివరించిన 'సినీతి చంద్రిక' ఆయన చేతి వాసికి గొప్ప ఉదాహరణలు.

చిన్న వేషాలు వేసినా వాటిని చిరస్మరణీయం చేసిన ఆయన నటనా వైదుష్యానికి 'కథానాయకుడు' 'గృహలక్ష్మి' 'బ్రహ్మచారి' వంటి చిత్రాలలోని వేషాలు మచ్చుతునకలు. నాటక రచయితగా, పత్రికా రచయితగా నటులుగా, నాటక ప్రయోక్తగా ఏ పని చేసినా రావి కొండలరావు మనసు పెట్టి చేశారు. ఆయన కృషి అజరం. అమరం.






## From the East Coast

Daily non-stop service from New York (JFK) to Delhi, with continuing service to Mumbai



Daily non-stop service from Newark to Mumbai, with continuing service to Delhi

Three weekly non-stop flights from Washington, D.C. to Delhi



## From the Midwest

Daily non-stop service from Chicago to Delhi, with continuing service to Hyderabad



## From the West Coast

Nine weekly flights from San Francisco to Delhi, with continuing service to Bengaluru six times a week

## Seamless Connections from our Delhi Hub

Passengers continuing to Ahmedabad, Amritsar, Bengaluru, Chennai, Hyderabad, Kolkata and Kochi via *select* Air India flights can clear customs and immigration upon arrival at their final destination.

We also have service from Delhi and Mumbai to over 50 other cities across India and South Asia. For details, fares, and reservations, contact your travel agent, or call 800-223-7776.

एअर इंडिया
AIR INDIA

A STAR ALLIANCE MEMBER

www.airindia.in

శ్రీ అట్లూరి జలపతి

మలబార్ తీరం.... ప్రకృతి అందాలకే కాదు అందమైన అమ్మాయిలకి కూడా కేరాఫ్ అడ్రెస్స్. శోభన, అసిన్, నయనతార, కీర్తి సురేష్... అబ్బో తెలుగు వారి మనసు దోచుకున్న కేరళ కుట్టిస్ లిస్ట్ వెరీ లాంగ్. ఇప్పుడు కేరళ తెలుగు సినిమాలకి కావాల్సిన కథలను ఎగుమతి చేస్తోంది. ఈ మధ్య హైదరాబాద్ కి, కొచ్చిన్ కి డైరక్ట్ ఫ్లైట్స్ పెరిగినట్లే, టాలీవుడ్ ఫిలిం నగర్ లోకి కేరళ కథలు ల్యాండ్ అవుతున్నాయి. మలయాళ సినిమాలను రీమేక్ చెయ్యడం లేటెస్ట్ అండ్ హాటెస్ట్ ట్రెండ్. భారత దేశంలో కంటెంట్ పరంగా క్వాలిటీ చూపిస్తోన్న చిత్రసీమ మలయాళ సినిమా. అమెజాన్ ప్రైమ్, హాట్ స్టార్, నెట్ ఫ్లిక్స్ వంటి ఓటిటి ప్లాట్ ఫార్మ్స్ వల్ల అన్ని భాషల వాళ్లకి మలయాళ చిత్రాల వైవిధ్యత, కథల సాంద్రత అర్థం అయ్యాయి. బాలీవుడ్ సినిమాల తర్వాత ఇప్పుడు ఓటిటిలో అధికంగా వ్యూయర్ షిప్ వున్నది వాటికే.



# కేరళ కథల క్రేజ్

దృశ్యం, ప్రేమమ్, పులిమురుగన్, లూసిఫర్, బెంగుళూరు డేస్ వంటి సినిమాలు సృష్టించిన సంచలనాలతో అందరి ఫోకస్ కేరళ కథలపై పడింది. ప్రేమమ్ సినిమా తెలుగు, కన్నడ భాషల్లోనూ, దృశ్యం తెలుగు, తమిళం, హిందీ, కన్నడం భాషల్లోనూ రీమేక్ అయ్యాయి. మలయాళ సినిమాలకి ఎంత డిమాండ్ ఉందో స్పెషల్‌గా చెప్పక్కర్లేదు. మరీ ముఖ్యంగా, రాబోయే రోజుల్లో మొత్తం కేరళ కథలే తెలుగు తెరపై పరుచుకునేలా ఉన్నాయి. ఒకటా, రెండా... అరడజన్ లేటెస్ట్ మలయాళ సినిమాల రీమేక్ రైట్స్‌ను తెలుగు నిర్మాతలు దక్కించుకున్నారు. వాటిని త్వరలోనే తీస్తారు.

### కథలు కావాలా నాయనా?

చిరంజీవి హీరోగా లూసిఫర్ సినిమా రీమేక్ కానుంది. మోహన్‌లాల్ నటించిన ఈ పొలిటికల్ థ్రిల్లర్ తెలుగులో కూడా దబ్ విడుదల అయింది. అయినప్పటికీ రీమేక్ రైట్స్ కొన్నారంటే తెలుగు సినిమా రంగంలో ఏ రేంజ్‌లో కథల కొరత ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతకుముందులా... ఏదో ఒక ఫారెన్ మూవీ చూసి కాపీ కొట్టేద్దామంటే నడవదు. కాపీ కొడితే జనం ఇట్టే పట్టేస్తున్నారు, ఒరిజినల్ మేకర్స్ కూడా కేసులేస్తున్నారు. జమానా బదల్ గయా మియా. ఆల్రెడీ డబ్ అయిన సినిమాలు కూడా రీమేక్ చేసేందుకు వెనుకాడట్లేదంటే కారణమిదే. లూసిఫర్ రీమేక్‌కి డైరెక్టర్ సుజిత్. ఇప్పుడు తెలుగీకరణ జరుగుతోంది.

వరుస ఫ్లాప్‌లతో ఏడాది పాటు (1995) మెగా స్టార్ రెస్ట్ తీసుకున్నాడు. ఏ సినిమా చెయ్యలేదు. తిరిగి హిట్ కొట్టింది కూడా ఒక మలయాళ సినిమా రీమేక్ తోనే. అదే హిట్లర్. చిరంజీవికి మలయాళ సినిమా రీమేక్‌లకి లింక్ ఉంది.




ఫహద్ ఫాజిల్ హీరోగా తెరకెక్కిన మహేసింటే ప్రతీకారం చిత్రం తెలుగులో ఉమామహేశ్వర ఉగ్ర రూపస్యగా మారింది. సత్యదేవ్ హీరో. కేరాఫ్ కంచర పాలెం సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న యువ దర్శకుడు వెంకటేష్ మహా తీసిన రెండో చిత్రం. నెట్‌ఫ్లిక్‌లో డైరెక్ట్ విడుదల. కేరాఫ్ కంచర పాలెం వంటి మంచి ఉత్తమ చిత్రం తీసిన డైరెక్టరే తన రెండో సినిమాకి మలయాళ రీమేక్‌గా తీసుకోవడం అంటే... చెప్పకనే చెబుతున్నది ఇదే ఇదే కథ అని. బాహుబలి నిర్మాతలు ఈ సినిమా ప్రొడ్యూస్ చెయ్యడం విశేషం. కేరళ కథలకు ఉన్న క్రేజ్ అది మరి.

ఇక ప్రేమమ్ సినిమా రీమేక్‌తో విజయాన్ని అందుకున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ఇప్పుడు వరుసపెట్టి మలయాళ సినిమాలను తెలుగులోకి దించుతోంది. పృథ్వీరాజ్, బిజూ మీనన్ హీరోలుగా రూపొందిన అయ్యప్పనం కోషియం సినిమా హక్కులు పొంది తెలుగులో రానా, మరో పెద్ద హీరోతో పునర్నిర్మించేందుకు రెడీ అయింది. ఈ సినిమా ఇంకా పట్టాలెక్కకముందే, కప్పేలా అనే మరో మలయాళ చిత్రం హక్కులు కూడా కొనేసింది. ఈ రెండు లైన్‌లో ఉన్నాయి.

హెలెన్ అనే మరో మలయాళ సినిమా రీమేక్ హక్కులని పీవీపీ సినిమా కొనుక్కుంది. సడెన్‌గా మాయం అయిపోయిన ఒక యువతి కథ ఇది. సినిమా హిట్టయింది. క్రిటిక్స్ మెచ్చుకున్నారు. ఇప్పుడు తెలుగులో రీమేక్ అవుతోంది. ఈ మధ్య పీవీపీ సంస్థ కూడా రీమేక్ సినిమాలనే నమ్ముకొంది. ఫ్రెంచ్ (ఊపిరి), స్పానిష్ (ఎవరు) రీమేక్‌ల నుంచి ఇప్పుడు మలయాళం, తమిళం సినిమాల వైపు చూపేస్తోంది.

తెలుగు తెరపైకి రానున్న మరో మూవీ... డ్రైవింగ్ లైసెన్స్. పృథ్వీరాజ్ హీరోగా తెరకెక్కిన మలయాళ మూవీ ఇది. ఈ సినిమా హక్కులను కూడా రామ్ చరణ్ తీసుకున్నాడు.

### *మలయాళ మంత్రంలో ఉన్న మహిమ!*

తమిళం నుంచి తెలుగులోకి రెగ్యులర్‌గా సినిమాలు రీమేక్ అవుతుంటాయి. తమిళ సినిమాలు లేకపోతే వెంకటేష్ వంటి హీరోలకి కెరీర్ ఉండదు. ఇప్పుడు ధనుష్ నటించిన అసురన్ సినిమాని నారప్పగా తీస్తున్నాడు వెంకీ. రామ్ నటించిన రెడ్ కూడా తమిళ రీమేక్. అయితే, ఇప్పుడు తమిళం కన్నా మలయాళ సినిమాలు మన మేకర్స్‌ని ఆకర్షిస్తున్నాయి. ఎందుకంటే... అక్కడి కథల్లో వెరైటీ ఉంది. నేటి తరం ప్రేక్షకులకి నచ్చే కాంటెంపరరీనెస్ ఉన్నాయి.





సహజత్వం ఉట్టిపడే కథనం, ఈజీగా రిలెట్ కాగల పాత్రలు న్యూ జనరేషన్ మలయాళం సినిమాల స్పెషలిటీ. నిజానికి అంగమాలి డైరీస్ అనే మలయాళ సినిమా కథ, ఆ స్టోరీ వెనుకున్న కమామీషు (పంది మాంసం వ్యాపారం, దాని చుట్టూ జరిగే గ్యాంగ్ వార్స్) మనకు అంతగా సూట్ అవదు. కానీ ఆ బ్యాక్‌డ్రాప్‌ని మన హైదరాబాద్ పాతబస్తీకి మార్చి మటన్ వ్యాపారం గొడవలుగా మలిస్తే అది కూడా హిట్ అయ్యింది. అదే విశ్వక్‌సేన్ నటించి, డైరెక్ట్ చేసిన ఫలక్‌నుమా దాస్. దీనికి కారణం పాత్రలు. ఆ పాత్రల ఎమోషన్స్. అందుకే మన తెలుగు మేకర్స్ ఇప్పుడు మలయాళ మోజులో ఉన్నారు.

దట్టిస్తున్నారు సక్సెస్ కోసం.

ఇక మేకర్స్... స్క్రిప్ట్ చదివి వాటిని జడ్జి చేసే జంజాటం అవసరం లేని 'మలయాళ రీమేక్'లకే ఓటేస్తున్నారు.

**బాలీవుడ్‌కి ఎగుమతి**

అయితే మన దగ్గరకూడా మంచి ప్రతిభ ఉంది, స్టోరీ రైటింగ్ టాలెంట్ ఉంది అనడానికి బాలీవుడ్‌లో నిర్మాణం జరుపుకుంటున్న టాలీవుడ్ సినిమాలే ఉదాహరణ. అర్జున్‌రెడ్డితో సందీప్‌రెడ్డి వంగా బాలీవుడ్‌కి కొత్త దారి చూపాడు.

అర్జున్‌రెడ్డి నుంచి స్టార్ట్ చేస్తే జెర్సీ, ఎఫ్2, హిట్, మత్తు వదలరా... ఇలా చాలా సినిమాలు ఒకేసారి







మరి, తెలుగులో అలాంటి కథలు, కథనాలు రాసేవారు లేరా? లేరు అనేది, హీరోలు, ఫిల్మ్ మేకర్స్ చెప్పే మాట. ఉన్నాము అని యువ రైటర్స్, డైరెక్టర్స్ గట్టిగానే మొత్తుకుంటున్నారు. కానీ వారి సౌండ్ డెసిబుల్స్... సులువుగా సక్సెస్ అందుకోవాలనుకునే మన మేకర్స్‌కి వినపడుతాయా? మల్లేశం అనే మంచి సినిమా వచ్చింది. పోయింది. సోషల్ మీడియాలో ఆహా, ఓహోలకే పరిమితం అయింది ఆ మూవీ. ఆ దర్శకుడికి మరో ఆఫర్ ఇచ్చారా? లేదు. మలయాళ సినిమాల్లాగే సహజంగా తీసిన మల్లెలతీరంలో వంటి సినిమాని ఎవరూ పట్టించుకోలేదు. అందుకే, తెలుగు యువ రైటర్స్, డైరెక్టర్స్ అనివార్యంగా 'మసాలా'

తెలుగు నుంచి హిందీలో రీమేక్ అవుతున్నాయి. ఇప్పుడు మనం చెప్పుకున్న సినిమాలన్నీ అఫీషియల్‌గా ఎనౌన్స్ చేసినవే. పైప్ లైన్‌లో మరో అరడజను సినిమాల వరకు ఉన్నాయి. జెర్సీ సినిమాని తెలుగు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి హిందీలో తీస్తున్నాడు. దిల్‌రాజు, అల్లు అరవింద్ కలిసి నిర్మిస్తున్నారు. షాహిద్ కపూర్ హీరో.

దిల్ రాజు తన రెండో హిందీ సినిమాని అనౌన్స్ చేశారు. తెలుగులో విశ్వక్‌సేన్ హీరోగా రూపొందిన హిట్ సినిమా తెలుగు దర్శకుడు శైలేష్ కొలను డైరెక్షన్‌లో హిందీలో రీమేక్ చేస్తున్నారు. రాజ్‌కుమార్‌రావ్ హీరో. ఎఫ్ 2, మత్తు వదలరా చర్చల దశలో ఉన్నాయి.

# WE ARE LOOKING for FRANCHISEE PARTNERS

CURIE LEARNING
*learning with the leader ...*



Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

## OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :

**rao@curielearing.com**

**or call on**

**703 582 0436 or 703 762 6120**

**Corporate Centers**

HERNDON.VA : herndon.va@curielearning.com
SOUTHRIDING.VA : southriding.va@curielearning.com
ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**

# సినీ సమీక్ష

శ్రీ అట్లూరి




**తారాగణం**
సత్యదేవ్ కంచరాన, హరిచందన, రూప కొడువాయూర్, వికె నరేష్, సుహాస్, కె. రాఘవన్, టిఎన్ఆర్ తదితరులు

**దర్శకత్వం**
వెంకటేష్ మహా

**రిలీజ్ డేట్:** జులై 30, 2020

**వేదిక:** నెట్‌ఫ్లిక్స్

అత్యంత సహజంగా ఉంటాయి మలయాళ చిత్రాలు. నిజజీవితంలో జరిగిన ఘటనలు, చూసిన వ్యక్తుల నుంచే చిన్న చిన్న సంఘటనల ఆధారంగా అక్కడ కథలు అల్లేస్తారు. అద్భుతంగా తీస్తారు. అలాంటి సినిమానే మహేషింటె ప్రతీకారమ్. అత్యంత సహజంగా తెరకెక్కిన ఈ సినిమాను, అంతే సహజంగా తెలుగులో రీమేక్ చేయడానికి ప్రయత్నించాడు దర్శకుడు వెంకటేష్ మహా. ఆ సినిమా ఆత్మని పట్టుకోవడంలో సక్సెస్ అయ్యాడు దర్శకుడు. తెలుగులో ఉమామహేశ్వర ఉగ్రరూపస్యగా విడుదలైన ఈ సినిమా టైటిల్‌లో ప్రతీకారం, ఉగ్రం ఉందనుకొని ఇది ఫుల్ రివెంజ్ డ్రామా అనుకోవద్దు. ప్రతీకారం తీసుకోవాలనుకునే వ్యక్తి కథే ఇది కానీ ఆతని పగ ఏంటో... తెలుసా? తనని కొట్టినవాడిని తిరిగి కొట్టాలనుకోవడమే. అంత సింపుల్ లైన్... అంతే అత్యంత సహజంగా తీశారు మలయాళంలో. అది తెలుగులోనూ కుదిరింది.

హీరో ఉమామహేశ్వరరావు (సత్యదేవ్) అరకులో ఫొటోగ్రాఫర్. తన పనేదో తాను చూసుకుంటాడు. ఒక అమ్మాయితో ప్రేమలో ఉంటాడు. కానీ ఆ అమ్మాయి అతన్నీ కాదనుకొని వేరే అతన్ని పెళ్లి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు కూడా ఆమెని ఏమీ నిందించకుండా... దూరంగా ఉండి ఆమె పెళ్లిని చూస్తాడు. అంత సౌమ్యుడు మహేష్. అలాంటి మహేష్... వీధిలో గొడవపడుతున్న వారిని విడిపించే ప్రయత్నంలో ఓ వీధి రౌడీ జోగినాథ్ (రవీంద్ర విజయ్) తో దెబ్బలు తింటాడు. తిరిగి కొట్టాలనుకుంటాడు కానీ బలం సరిపోదు. జరిగిన అవమానానికి ఊరందరి ముందు పరువుపోతుంది.

దీంతో ఎలాగైనా వాడిని తిరిగి కొట్టాకే చెప్పులు వేసుకుంటానని శపథం చేస్తాడు. ఎలాగైనా జోగినాథ్‌ను కొట్టాలని ఊరిలో కుంగ్ ఫూ ఇనిస్టిట్యూట్‌లో చేరి ట్రైనింగ్ తీసుకుంటాడు. అదే టైమ్‌లో హీరో కొట్టాల్సిన వాడు సౌదీ వెళ్లిపోతాడు. మరి ఉమా మహేశ్వరావు తన శపథం నెరవేర్చుకున్నాడా... తిరిగి చెప్పులేసుకున్నాడా అనేది స్టోరీ.

ఈ సినిమాను రివెంజ్ డ్రామాగా మాత్రం చూడ్డానికి వీల్లేదు. ఓ సాధారణ వ్యక్తి, అప్పటివరకు తను కలలో కూడా ఊహించని ఓ బలాన్ని, కసిని ఎలా కనుగొన్నాడు, మరింత మెరుగైన మనిషిగా ఎలా మారాడనేది ఈ సినిమాలో సున్నితంగా స్పృశించారు. ఈ సినిమాలో ప్రతీకారం కన్నా... హీరో తన సత్తాని కనుక్కోవడం అనేది అండర్ కరెంట్ థీమ్.

మహేష్ ఫొటోగ్రాఫర్ కానీ అతని ఫొటోల్లో గొప్పదనం ఏమీలేదు. 'చిన్ అప్, చిన్ డౌన్, అయిస్ వైడ్' అంటూ మెకానికల్‌గా ఫొటోలు తీసే బ్యాచ్ అతను.




మొదటిసారి అతని టాలెంట్‌ని వెక్కిరిస్తుంది జ్యోతి అనే అమ్మాయి. ఆ అమ్మాయి వెక్కిరింత తర్వాత తన ఫొటోగ్రఫీలో ఏమి లోపం ఉంతో తెలుసుకుంటాడు. తన తండ్రి చెప్పిన కొన్ని మాటల వల్ల తన రియల్ టాలెంట్‌ని బయటికి తీస్తాడు. అలా... ప్రతీకారం, దాగి ఉన్న ప్రతిభకి మెరుగులు దిద్దుకోవడం అనే రెండు అంశాలు కలబోతగా సాగుతుంది మూవీ.

ఇంతకుముందే చెప్పుకున్నట్టు అరకు బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా సహజంగా కనిపిస్తుంది. పాత్రలు కూడా అంతే సహజంగా కనిపిస్తాయి. ఉమామహేశ్వర రావుగా సత్యదేవ్ చాలా బాగా నటించాడు. నటుడిగా అతడ్ని రెండు మెట్లు పైకెక్కించే సినిమా ఇది. సీనియర్ నరేష్ మరోసారి తన సీనియారిటీ చూపించగా.. సుహాస్, హరిచందన, టీఎన్‌ఆర్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. జ్యోతి పాత్రలో కొత్త అమ్మాయి రూప కొడియర్ నటన స్ట్రైకింగ్ గా ఉంది. బిజబుల్ నేపథ్య సంగీతం, అప్పు ప్రభాకర్ సినిమాటోగ్రఫీ సినిమాకు ప్లస్ అయ్యాయి.

కేరాఫ్ కంచరపాలెం సినిమాతో అందరి మెప్పు పొందిన దర్శకుడు వెంకటేష్ మహా. ఉమామహేశ్వర ఉగ్రరూపస్య సినిమాను కూడా తన మొదటి సినిమా లానే సహజత్వంతో నింపేశాడు. అయితే ఇందులో అతడి క్రియేటివిటీ కంటే ఒరిజినల్ వెర్షన్ ఛాయలే ఎక్కువగా కనిపిస్తాయి. స్క్రీన్ ప్లే క్రెడిట్‌ను మహా తీసుకున్నప్పటికీ... మలయాళం వెర్షన్‌తో పోల్చి చూస్తే తెలుగులో అతడు చేసిన మార్పులు చాలా తక్కువ. ఉన్నదున్నట్టు తీయడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు.

ఇలా చేయడం వల్ల కొంత లాభం జరిగినప్పటికీ, ఇంకొంత నష్టం కూడా జరిగింది. ఆహ్లాదంగా మొదలైన ఈ సినిమా మధ్యలోకి వచ్చేసరికి కాస్త బోర్ కొడుతుంది. కుంగ్ ఫూ ట్రైనింగ్ లో జాయిన్ అయిన తర్వాత తను కొట్టాల్సిన వాడు సౌదీ నుంచి ఎప్పుడొస్తాడా అని ఎదురుచూడడం, తనలో దాగిన ఫొటోగ్రాఫర్‌ను మహేష్ మళ్లీ వెలికితీయడం, మళ్లీ ప్రేమలో పడడం లాంటి ఎపిసోడ్లు కాస్త నెమ్మదిగా సాగినట్టు అనిపిస్తాయి.

ఎడిటింగ్‌లో కొంత కట్ చేసి ఉంటే బాగుండేది. ఒరిజినల్‌ను చెడగొట్టకూడదనే తాపత్రయం వల్ల వచ్చిన చిక్కు ఇది. దీనికి తోడు క్లైమాక్స్ ఏంటనేది ముందుగానే ప్రేక్షకుడు ఊహించగలే ఈ కథలో... నెమ్మదితనం కొంత ఇబ్బంది పెడుతుంది.

ఇలాంటి బలహీనతల్ని పక్కనపెడితే... ఉమామహేశ్వర ఉగ్రరూపస్య సినిమా డిలైట్ ఫుల్ వాచ్ అనిపించుకుంటుంది. ఒరిజినల్ మూవీని ఆల్రెడీ చూసేసిన వాళ్లకు మాత్రం ఈ మహేషుడు గొప్పగా అనిపించకపోవచ్చు... కానీ చూడని వాళ్లకి ఇది బాగా నచ్చుతుంది. ఓవరాల్‌గా ఉమామహేశ్వర ఉగ్రరూపస్య సినిమా ఓ జెన్యూన్ రీమేక్‌గా, డీసెంట్ సినిమా అనిపించుకుంటుంది.

**బాటమ్ లైన్:** ఉమామహేశ్వర సహజరూపస్య

కొసరి పాటలు

# కొసరాజు

**కొసరాజు పేరు వినగానే రైతుజీవితదర్పణాలవంటి గేయాలు, తాత్వికగీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపదగీతాలు, ప్రబోధగీతాలు సినీ సంగీతప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.**

**కొసరాజు రాఘవయ్య గారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు ' సినిమాతో గానీ జరగలేదు.'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజా పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారి తీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.**

**మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్ధంలో ప్రధానంగా 1970 ప్రాంతాలవరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వ భౌమ' బిరుదానికి అర్హుణ్ణి చేశాయి. ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.**



❖ చంద్రహాస్

## 'ఏవియం' సినిమాలు



సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ 'ఏవీఎం' తమిళచిత్రసీమలో ప్రధానంగా పనిచేసినా వారి తెలుగు సినిమాలకు ఆంధ్ర ప్రేక్షకలోకంలో కూడా దశాబ్దాలుగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఈ సంస్థ అధినేత ఏవి మెయ్యప్పన్ చెట్టియార్‌కు కొసరాజు పాట అంటే చాలా అభిమానం. ఏరువాక పాటలాంటిది ఒకటి వ్రాసిస్తే ఐదువేలు ఇస్తానని ఒకసారి అన్నారట కొసరాజుతో. ఆ కిటుకు ఏదో తెలిస్తే నేనే వ్రాసుకుని సినిమా తీస్తాగానీ మీకెందుకు ఇస్తాను అన్నారట కొసరాజు. చెట్టియార్ ఆ మాటలకు పగలబడి నవ్వారట.

'ఏవిఎం చెట్టియార్ చాలా సమర్థుడు. మేధావి. మ్యూజిక్‌లో మంచి టేస్టున్న ఘటికుడు,' అని పై విషయం గురించి చెప్తూ తన ఆత్మకథలో వ్రాసుకున్నారు కొసరాజు.




మెయ్యప్పన్ చెట్టియార్‌కి సంగీతం పట్ల ఆసక్తి, అభిరుచి ఉండటం, జనరంజకంగా ఉండే సంగీతం పట్ల మంచి అవగాహన ఉండటం కాకతాళీయం కాదు. వాళ్ల నాన్నగారికి స్వస్థలమైన కరైకుడిలో గ్రామఫోన్ రికార్డులు అమ్మే షాపు ఉండేది.

మెయ్యప్ప మరో అడుగు ముందుకేసి 'సరస్వతి స్టోర్స్' అనే షాపు పెట్టి, మద్రాసుకు మకాం మార్చి, 'ఓడియోన్' రికార్డులతో ఒప్పందం చేసుకుని వారి రికార్డులు అమ్మటమేకాక, స్వంతంగా ఒక రికార్డింగ్ స్టూడియో, వాద్యబృందం ఏర్పాటు చేసుకుని, శాస్త్రీయ, జానపద, నాటక సంగీతాన్ని స్వంతంగా రికార్డ్ చేసి తన షాపు ద్వారా అమ్మేవారట. అటువంటి ఆలోచన రావడం, దాన్ని కార్యరూపంలోకి తీసుకురావడం ఆయన వ్యాపారదక్షతకు ఉదాహరణలు.

సి.ఆర్. సుబ్బరామన్, ఆర్. సుదర్శనం, విశ్వనాథన్-రామ్మూర్తి ద్వయంలోని రామ్మూర్తి సినిమాల్లోకి రాకముందు సరస్వతి స్టోర్స్ సంగీత విభాగంలో పని చేసిన వారిలో ఉన్నారు. పి. లీల కూడా కొన్ని రికార్డులను సరస్వతీ వారికి పాడారు. అంతేగాక అరియకుడి రామానుజ అయ్యంగార్ వంటి ప్రఖ్యాత విద్వాంసుడికి సైతం సరస్వతి స్టోర్స్‌తో ఎక్స్‌క్లూజివ్ ఒప్పందం ఉండేది.

తరవాతి రోజుల్లో మెయ్యప్ప సినిమా నిర్మాణం ప్రారంభించిన తర్వాత కూడా ఏవిఎం సినిమాల ఆడియో రికార్డ్స్‌కి సరస్వతి స్టోర్స్ ఒక వాహికగా పని చేసింది.

ఇక ఏవిఎం సినిమాల్లో సంగీతం ఎంత ప్రసిద్ధంగా ఉండేదో వేరే చెప్పక్కర్లేదు.

మెయ్యప్ప చెట్టియార్‌తో కొసరాజు మొదటి పని చేసింది 1956లో వచ్చిన 'శంకర్ ప్రొడక్షన్స్' వారి 'సదారమ' సినిమాతో.




పిల్ల యింకాడి కెల్తావు లేవే
తల్లి శిగ్గాయ్య నా సేత సిక్కావే
రామసిలకల్లె నా సేత సిక్కావె సిక్కావె

కాకమ్మ ఎగిరెనే కండొకటి తెచ్చెనే
గెద్దమ్మ తన్నుకెళ్లెనె ఆ దారిలో
యీ పిల్లి బావ సూసెనే సల్లంగ కాసెనే
సెప్పకుండ గొంతు గొరికి సప్పరించెనే
మోల్చుకున్న మొగాళ్లంత మొగుళ్లౌదురా
పూసే పూలన్ని గూడ కాయ లౌతయా
ఎక్కడున్న వోళ్ల కొరకో ఏడుస్తావెందుకే
బల్ సక్కనోణ్ని సన్నేలుకోవేమే

సిటికేసి రమ్మంటె సిగ్గుపడతావెందుకే
మనసంత దోచుకొనని మాట్లాడ వెందుకే
మనసంత దోచుకొని మాట్లాడ వెందుకే
ఒంటిగాను కంటబడితివే-వయ్యారి భామ
జంట కుదిరె యెంటరావే వయ్యారిభామ
కన్ను మూతబెట్టలేనే-కాలుదీసి పెట్టలేనే
నిన్నిడిసి వుండలేనే-ఓ చిన్నదాన
నిమిశమైన ఓపలేనె
నావంక జూడవా నా ముద్దు తీర్చవా
సితారుకొమ్మని మిఠాయిపొట్లం
సేతికి సికిందే-

ఈ చిత్రానికి నాయిక సదారమ (షావుకారు జానకి). ఆమె తొలుత అదృష్టవశాత్తు ఒక మహా రాజును పెండ్లాడినా కాలం కలిసిరాక తర్వాత కష్టాల పాలు అవుతుంది. కారాగారంలో ఉన్న ఆమెను కోటకు కన్నం వేయడానికి వచ్చిన ఒక దొంగ- ఇతని పేరు కన్నయ్య- చూసి నోరూరి ఎత్తుకుపోతాడు. అతని కంట్లో కారం జల్లి ఆమె తప్పించుకోవటం, కన్నయ్యతో బాటు ఆమె భర్త, తండ్రి, ఆమెను కారాగారంలో బంధించిన శత్రురాజు ఆమె కోసం వెతకడం తర్వాత కథ.

ఈ దొంగ పాత్రకు 'గేవా కలర్' దృశ్యాలు పెట్టి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దామని ప్రచారం కూడా చేశారు నిర్మాతలు. ఇటువంటి మామూలు పాత్రకు రంగులు కూడా అద్ది సినిమాకు హైలెట్‌గా చేయటంలో నిర్మాత, దర్శకుల ధైర్యానికి మెచ్చుకోవాలి. అంతేకాక దొంగ కన్నయ్యకు ఏకంగా నాలుగు పాటలు కూడా ఉన్నాయి- మూడు సోలోలు, మరొకటి హీరోయిన్‌తో యుగళగీతం.

ఈ నాలుగూ కొసరాజు వ్రాసినవి. ఈ పాటలలో ఒక్కదానికే ఈరోజు ఆడియో అంతర్జాలంలో దొరుకు తోంది. వలసినంత స్టార్ పవర్ లేక కాలగర్భంలో కలిసిపోయిన ఈ పాటలు అన్నీ దేశీయ పలుకుబడితో చాలా చక్కగా ఉంటాయి.

కన్నయ్య పాడే మొదటిపాట 'పిల్లా ఇంకాడి కెళ్తావులేవే' అన్న దాంట్లో ఇక ఈ అమ్మాయి తప్పించు కోలేదు అన్న ధైర్యం, వేరే దుర్మార్గుడు అపహరించిన ఆమెను అతనికంటే ఘనుడిలాగా తను ఎగరేసుకు వచ్చానన్న సంతోషం కనపడతాయి.

కాకమ్మ తెచ్చిన 'కండ' (మాంసం ముక్క), గెద్ద తన్నుకుపోవటం, పిల్లిబావ దారికాసి 'సప్ప'రించడం, 'తల్లి సిగ్గొయ్య'లాంటి అచ్చమైన గ్రామీణ ప్రయోగాలు, పూర్తిగా పల్లెయాసతో సహజంగా ఉండే భాష, 'కన్ను మూసిపెట్టలేనే-కాలుతీసి పెట్టలేనే' అనడంలోని ఆరాటం గమనించండి. ఇది కొసరాజుకే సాధ్యపడిన శైలి.

బల్ సక్కనోడినని చెప్పినా ఆమె అతన్ని ఇష్ట పడటం లేదని బెదిరింపులకు దిగుతాడు కన్నయ్య 'ఊరుపేరంత నీకెందుకే పిల్ల' అన్న పాటలో.

తను ఎంత భయంకరమైనవాడో ఒకపక్క (పరుగెత్తే పామైనా అతన్ని చూస్తే పండుకుండది అని చెప్పటం ఎంత బాగుందో), దోచిన సొమ్మంతా ఇస్తా నని ఆశ మరోపక్క ఈ పాటలో అతను ప్రయోగించే పన్నాగాలు.

*ఊరుపేరంత నీకెందుకే-పిల్ల*
*పేరు జెప్పితె గుండె ఆరుమంటదే*
*ఊరు నాడంత నేనంటె ఒణికిపోతదే*
*అబ్బ పరుగెత్తె పామైన పండుకుంటదే*

*బస్తీల బడతాను-కోస్తాల గొడతాను*
*తలుసుకుంటె లోకమంత తల్లకిందు సేస్తాను*
*కచ్చెబట్టినానంటె కాలికింద రాస్తాను*

*పగలనక రెయ్యనక-పామనక తేలనక*
*పోగుజేస్తుండేది ఒకడే-దాన్ని*
*లంచమని కాజేసేదొకడే*
*ఆడి నెత్తిమీద కొట్టి అడుగుబొడుగు వూడ్చిపెట్టి*
*లబోదిబో అనిపించి గాబరాదినిపించి*
*జేబులో యేసుకునేదీదే-యీడే-యీడే*

*రోజువాడ్డీ లలేసుకుని రొక్కమంత పోసుకునే*
*లోభుల్ని పంథపడతనె-దోచుకున్న*
*లాభాల్ని రాలగొడతానె*

*వేడి వేడిగా వడ్డిస్తా వీపుకు సున్నం బట్టిస్తా*
*చలో చలోమని దాడేస్తా తెచ్చిందంతా నీకిస్తా*
*అశ్శరభ దశ్శరభ అదరేస్తా బెదరేస్తా*
*అయ్యొబాబొ కుయ్యొమొర్రో అద్దిరభన్న హైసరుబజ్జ*
*గుడు గుడుగుడుగుడు - గుర్ తకజణుత*
*డిడీర్ పడీర్ తోం తా*

ఇక వ్యవహారం శృతిమించుతోందని గ్రహించి, ఆమె అతన్ని ఇష్టపడుతున్నట్లు నటిస్తూ అసలే మోస గాడివి వేషగాడివి, ఎట్లా నమ్మేది అని అమాయకంగా అడిగే పాట 'నీ వేషాలన్నీ చూసి'.

నీ వేషాలన్ని జూసి నీ మోసాలన్ని తెలిసి
నిన్నెట్ట నమ్మ్రుదురో రయ్యో కన్నయ్యా
నేనెట్టా వొచ్చేదో రయ్యో కన్నయ్యా

మాటంటే తప్పనే బూటకాలు సెప్పనే
పాణమైన యిస్తానే సిట్టమ్మా
నిన్ను పెళ్లి చేసుకుంటానె సిట్టమ్మా

కాపరాని కిల్లేలేదు కట్టుకోను గుడ్డే లేదు
పెట్టుకోను సొమ్ములేవిరో రయ్యో కన్నయ్యా
కట్టుకుంటె లాభమేమి రయ్యో కన్నయ్యా

మెడనిండ నగలేస్తా మేనాలో దిప్పిస్తా
మేడల్లో వుంచేస్తా సిట్టమ్మా
తోడు నీడగుంటానే సిట్టమ్మా

దిక్కులేని దాననురా టక్కులేమి యెరగనురా
సూడసక్కనోడవురో రయ్యో కన్నయ్యా
నీడతోటె వుందునురో రయ్యో కన్నయ్యా

ఈ గీతం సాహిత్యం ఆసాంతం చక్కని తూగుతో ఉంటుంది. 'కాపరానికిల్లే లేదు కట్టుకోను గుడ్డే లేదు' మొదలైన లైన్లలో కొసరాజు ప్రఖ్యాత గీతం సరిగంచు చీరగట్టి గుర్తుకొస్తుంది.

ఈ ఒక్క పాటకు మాత్రం ఆడియో నాకు దొరికింది. పి. సుశీలతో ఇక్కడ గొంతు కలిపింది ఎవరో కాదు టీఎం సౌందరరాజన్ అంటే ఆశ్చర్యం కలగవచ్చు. తెలుగుభాష రాకపోయినా కొసరాజు సాహిత్యానికి భాషలో యాసలో పూర్తి న్యాయం చేస్తూ చాలా బాగా పాడారు సౌందరరాజన్.

చివరిగా సదారమ పారిపోయాక ఆమెను వెదుక్కుంటూ దొంగ కన్నయ్య సోది చెప్పే వాని వేషంలో పాడే పాట 'సోదోయమ్మ సోది'.

వివిధ వృత్తుల వాళ్ల పాటలు ఎన్నో వ్రాసి మెప్పించిన కొసరాజు, ఈ సోది పాట అంత అమోఘంగానూ వ్రాశారు. ఉజ్జయిని మహంకాళి, బెజవాడ దుర్గమ్మ, దొనకొండ గంగమ్మ, వినుకొండ అంకమ్మ, ఇంకా

సోదోయమ్మ సోదోయ్ సోది సోది సోది భలే
సోది జెపుతానె తల్లె సోది జెపుతానె
సోది జెపుత సోది జెపుత సోది జెపుతానె ॥సోది॥

వున్నది వున్నట్టుగా - లేనిది లేనట్టుగా
తలుసుకున్నదేమొ సెపుత దాకలాలు సూపిసాత్త
వుజ్జయినీ మాంకాళి ఓ అంటే పలుకుతాది
బెజవాడ దుర్గమ్మ బుజముగాసి వుంటాది
దొనకొండ గంగమ్మ ఇనుకొండ అంకమ్మ
ముక్కోటి దేవతలు ముందు నడిసి వస్తారు
నల్లని వాక్కిస్తారు సత్తెం పలికిస్తారు
గాలెరుక ధూళెరుక కనికట్టెరుక
మాటెరుక మూటెరుక బూటకమెరుక
మాయెరుక మర్మమెరక మంత్రతంత్ర మహిమెరక
కంతిరి బింతిరి మంతిరి కర్ణపిశాచి యెరుక
కాయౌనా తల్లె పండౌనా
కాయౌనా పండౌనా గట్టిగ సెపుత
కల్లేదో నిజమేదో యెల్లగక్కుత
అదీ యిదీ సెపుతానె అసలు సంగతి సెపుతానె
నంగనాసి తుంగబుర్ర రంగు కాస్త బైటపెడత

మాయ మంత్రం, మర్మం తంత్రం, ఇవి చాలవన్నట్టు కర్ణ పిశాచి- ఇంత సహాయం ఉండి అతను చెప్పే సోది ఎవరైనా నమ్మకుండా ఉంటారా.

ఈ పాటలు మెయ్యప్పకు బాగా నచ్చిఉంటాయి. కొసరాజు జానపద ఫక్కీలో తమాషా ట్యూన్స్‌లో రాసుకొస్తే అవే జనంలోకి బాగా వెళతాయని మెచ్చుకునే వారట.

## 2

మళ్లీ ఎప్పుడో పద కొండేళ్లకు 'భక్త ప్రహ్లాద' (1967) తీసినప్పుడు గుర్తు పెట్టుకుని కొసరాజును పిలిపించారట మెయ్యప్ప చెట్టియారు.




హిరణ్యకశిపుని గుణగణాలు ప్రశంసిస్తూ ఒక హరి





హిరణ్యకశిపుని దివ్య చరిత్రము
నవరస భరితమురా ॥హిర॥
వినవినవెంతో వీనుల విందై వింత గొల్పుగదరా

వెడలెను రాక్షసనాధుడు
విజయదుందుభులు మొరయగ ॥వెడ॥
బేలలగుచు దిక్పాలకులందరు
భీతి జెంది గొందులబడిపారగ ॥వెడ॥

ఓరోరీ వరుణారారా! చర్మమొలిపించెదను చూడరా
నెల మూడు వానాలు
కురిపించుటలు మాని
అహ పైరు పచ్చుల పెంపు

గావించుటలు మాని
దేశదిమ్మరులగుచు తిరుగుచున్నారటర
ఓరోరి వరుణా రారా చర్మమొలిపించెదను చూడరా

చెట్టుమీదా ఒక్క చిలకుందీ!
దాని పక్కగానే జామ పండుందీ!
చూచి చూడకుండ చప్పరించకుండ
ఎగిరిపోతే లాభమేముంది! అయ్య! ॥చెట్టు॥

ఊర్వశితా వచ్చి వొయ్యార మొలికింప
మొగము తిప్పుకొని వచ్చావూ
రాజాధిరాజ హిరణ్య మహారాజా
వలపు జూపక మనసు దాచేవు - అయ్యో
మెత్తని నీ మనసు దాచేవు ॥చెట్టు॥

చందమామ వచ్చి ముందునిల్చిన ఏమొ
వెచ్చంగ వుందయ్యా దేహం - అబ్బ
వెచ్చంగ వుందయ్య దేహం - నా దేహం
చల్లని నీ చేయి తగిలితేనే చాలు
తీరిపోతుందయ్య మోహం
చల్లారిపోతుంది తాపం విరహతాపం ॥చెట్టు॥

కథ వ్రాయాలి. కొసరాజుకు నచ్చిన విధంగా తెలుగు దేశంలో ప్రచారంలో ఉన్న పద్ధతిలో వ్రాయమని చెట్టియార్ పురమాయిస్తే కొసరాజు వ్రాసిన 'హిరణ్య కశిపుని దివ్యచరిత్రము' కొంత భాగం చూడండి.

చండామార్కులు (రేలంగి-పద్మనాభం మాధవ పెద్ది-పిఠాపురం కంఠాలతో) పాడిన ఈ పాట ఊహించి నట్టు హాస్యభరితంగా ఉంటుంది.

హిరణ్యకశిపుడు లోకమంతా తన నామాన్ని స్మరించాలి, నేనే దేవుడిని, పూజలు తనకై జరగాలి అని ప్రకటిస్తాడు.

గురుపుత్రులైన చండామార్కులు అతన్ని కీర్తిస్తూ విజయగాథలను గానం చేయటం ఆశ్చర్యంకాదు. సామాన్యజనం కూడా తప్పక అతని గురించే పాడు కుంటున్నారు అనటానికి, ఈ హరికథకు కొనసాగింపుగా చెట్టు మీద చిలక ఉంది అన్న జానపద గీతం కూడా వ్రాశారు కొసరాజు.

ప్రియుణ్ణి కవ్విస్తూ ఒక పడుచు అతడిని 'ఊర్వశిని వదిలేసి వచ్చిన హిరణ్యకశిపుడివా' అనడం లోని చమత్కారం చూడండి.

ఈ పాటలు విని చెట్టియార్ ఎంతో సంతోషించడమే కాకుండా ప్రహ్లాద వేరే భాషలోకి అనువదించినప్పుడు కొసరాజు బాణీలోనే ఈ పాటను ఇతర భాషల్లో వ్రాయించారట.

ఇక్కడ రెండు విషయాలు గ్రహించాలి.

మొదటిది చెట్టియార్‌కు ప్రతిభను గుర్తించి గౌరవించటంలో ఉన్న ప్రజ్ఞ. తీసేది తెలుగు సినిమా అయినప్పుడు చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వం, డి.వి. నరసరాజు రచన, రాజేశ్వరరావు సంగీతం, సముద్రాల దాశరథి కొసరాజు మొదలైనవారి పాటలు- ఇలా అనుభవజ్ఞులైన తెలుగు కళాకారులకు స్వేచ్ఛనిచ్చి సినిమా తీయటంలోని అంచనా.

రెండవది- కొసరాజు తన పాటను తనకు తోచిన బాణీలో పాడి వినిపించడం, అదే ట్యూన్‌ను కొద్ది మార్పులతో సంగీత దర్శకుడు స్వీకరించడం చాలా సార్లు జరిగేది. ఆయనకు సాహిత్యం మీదేకాక పాడు కునే బాణీ మీద కూడా మంచి పట్టు ఉండటం వల్ల ఆయన పాడినదే ఆ సాహిత్యానికి సరిపోయేది, బాగుం డేది. ఒకరకంగా ఆయన ఆధునిక జానపద వాగ్గేయ కారుడు అనుకోవచ్చు.

భక్త ప్రహ్లాదకు కొసరాజు వ్రాసిన మూడో పాట 'పాములోళ్లమయ్యా మా పెగ్గె చూడరయ్యా.'

రమణారెడ్డి, డా. శివరామకృష్ణయ్య బృందం మీద చిత్రించిన ఈ పాములవాళ్ల పాట పిఠాపురం, ఎల్ఆర్. ఈశ్వరి పాడారు.

ప్రహ్లాదుడు హరిభజన మానకపోతే తండ్రి కోపించి రకరకాల దారుణ శిక్షలు వేయిస్తాడు. ఆ క్రమంలో పాములతో కాటు వేయించడానికి ఈ పాములవాళ్ల దగ్గరికి తీసుకెళ్తారు.



పాములోళ్లమయ్యా! మాపెగ్గె చూడరయ్య బల్లె ॥పా॥

ఈరిగాడి తమ్ముడు బంగారుగాడు ఉన్నడు
కంకణాల కాటిగాడు లంకణాల కోటిగాడు
సింకికళ్ల పోతడు మా జాతికెల్ల మొనగాడు ॥పా॥

గొర్రైనైన బర్రైనైన గుట్టకేసే కొండసిలవ
మడిసివైన మాకువైన మట్టుబెట్టు మిన్నాగు
యినము గక్కు బొక్కబెరుడు తరిమికరను
తాడిగిరి ఆహా

యీటిపాలబడ్డవాడు బతికి బట్టగట్టలేడు ॥పా॥
బొమ్మజెముడు పొదకాడ బుస్సు బుస్సు మన్నది
తప్పదియ్య దీని తప్పదియ్య చెయ్యి పెడితె
కస్సు కస్సు మన్నది

కట్టుగట్టి పడితేను కదలకుండ ఉన్నదీ ఓహెయ్!
ఒదిలిపెడితె పేణాలు గావుపడుతనన్నది
పగబట్టినపుడు దీని పరవళ్లు సూడాలి కాటేసేటపుడు
దీని కవ్వింపు సూడాలి అబ్బో అబ్బో అబ్బో
అచ్చమైన తాచు దీని కచ్చె యెపుడు కానలేడు ఆహా ఓహో
పడిగె తిప్పి కొట్టెనంటె బెమ్మకూడ తిప్పలేడు ॥పా॥

పెగ్గె అంటే బడాయి, ప్రగల్భము అని అర్థం. పాముల వాళ్ల పేర్లు చూడండి- ఈరిగాడు, బంగారు గాడు, కంకణాల కాటిగాడు, లంకణాల కోటిగాడు, సింకికళ్ల పోతడు ఇలా. కాటిగాడు కంకణాలు పెట్టు కుంటాడని, కోటిగాడు జబ్బు మనిషని, లంకణాలు చేస్తుంటాడని అనుకోవాలి.

పాముల లిస్టులో మనకు తెలిసిన కొండసిలువ, మిన్నాగు, త్రాచులే కాక, బొక్క బెరడు, తాటిగిరి వంటి ఈరోజు మనకు అంతగా తెలియని పాములు కూడా కనిపిస్తాయి. తాటిగిరిపాము తాటిచెట్టు పైన ఉంటుంది.

కనకతార చిత్రంలో ఇంతకుముందు చూసిన బెస్తవాళ్ల పాట జ్ఞప్తికి తెచ్చే ఈ పాట హాస్యంగా మొదలు పెట్టినా, చివరి చరణంలో కోడెత్రాచును వర్ణించే టప్పుడు ఒళ్లు గగుర్పొడిచే విధంగా వ్రాశారు కొసరాజు. 'పడగ తిప్పికొట్టే పగబట్టిన అచ్చమైన తాచు కచ్చ' ఊహించుకుంటే భయం వేయకమానదు.

అయితే సముద్రాల హరిభజన గీతాలు, పోతన భాగవత పద్యాలు ముద్దులొలికే ప్రహ్లాదుడు పాడుతుంటే చూసేవారికి ఇక వేరే పాటలు అంతగా ఆనవు ఈ సినిమాలో.

అందుకే ఇంత మంచి సాహిత్యం కూడా ఎక్కువ ప్రచారంలోకి రాలేదు. ప్రధాన పాత్రలకు, కథాగమనానికి అంతగా అక్కరలేని పాటలు వ్రాసే పరిస్థితి కొసరాజుకు ఎక్కువసార్లే ఉండేదని ఇంతకుముందు చెప్పుకున్నాం.

3




ఏవిఎంకి కొసరాజు వ్రాసిన పాటలలో పై పాటలకు భిన్నంగా బహుశా అత్యంత ప్రజాదరణ పొందింది ఇదే సంవత్సరం (1967) వచ్చిన సస్పెన్స్ సినిమా 'అవేకళ్లు'లోని 'మా ఊళ్లో ఒక పడుచుంది' పాట.

అంతకుముందు సంవత్సరం రిలీజ్ అయిన 'గూఢచారి116'తో తారాపథానికి చేరిన కృష్ణ, ఇంకా కాంచన, పద్మనాభం, గీతాంజలి మొదలైన వారిపై చిత్రీకరించబడి, వేదా చేసిన వేగవంతమైన వరస, పాశ్చాత్య శైలిలోని వాద్యగోష్ఠి- వీటితో ఈరోజుకైనా వినపడితే హుషారెత్తించే పాట ఇది.

సహజంగా రూపసి అయిన కృష్ణ భలే యంగ్‌గా లెదర్ జాకెట్‌లో డాషింగ్‌గా కనిపిస్తారు.

ఘంటసాల, పిఠాపురం మాంచి జోరుగా ఈ పాట పాడారు. తమిళంలో తెలుగులో ఒక్కసారే తీయబడిన ఈ సినిమాకు అవే వరుసలు రెండు భాషల్లోనూ వాడుకున్నారు. తమిళంలో టి.యం. సౌందరరాజన్ మామూలుగా పాడిన దానికీ తెలుగులో ఘంటసాల ఇచ్చిన ఎనర్జీకి ఎంతో తేడా ఉంది.



మా ఊళ్లో ఒక పడుచుందీ
దయ్యమంటె భయమన్నది
డు డు డు డు డు

మా వూళ్లో ఒక పడుచుందీ
దయ్యమంటె భయమన్నది
ఆ వూళ్లో ఒక చిన్నోడు
నేనున్నాలే పదమన్నాడు
చెమ్మచెక్క చెమ్మచెక్క చెమ్మచెక్క
మల్లెమొగ్గ మల్లెమొగ్గ మల్లెమొగ్గ
బలె బలె బలె బలె బలే హ ॥మా॥

కంటిమీద కునుకురాదు బావా అందీ
కన్ను మూసుకో నన్ను తలుచుకో పిల్లా అన్నాడూ
ఓలమ్మో గైరమ్మో చీకట్లో చూసిందేదో
ఓలమ్మో గైరమ్మో కెవ్వంటూ అరచిందయ్యో
అరె హట్కె హట్కె హట్కె అరె బతికె బతికె బతికె
బలె బలె బలె బలె బలే హ ॥మా॥

బుర్రుపిట్ట తుర్రుమంటే బాబో అందీ
అత్తకొడుకుని అరవబోకులే పిల్లా అన్నాడు
ఓలమ్మో గైరమ్మో చీకట్లో చూసిందేదో
ఓలమ్మో గైరమ్మో కెవ్వంటూ అరచిందయ్యో
అరె హట్కె హట్కె హట్కె అరె బతికె బతికె బతికె
బలె బలె బలె బలె బలే హ ॥మా॥

తమిళ వెర్షన్‌లో హీరోయిన్‌ని భయపెట్టడానికి సోడిజా, డాకరా అన్న అర్థం లేనట్టున్న మాటలు వాడారు. సౌరాష్ట్ర భాషలో 'నన్ను వదులు', 'భయంగా ఉంది' అని వీటికి అర్థాలట.

అదే విధంగా తెలుగులో కొసరాజు చెమ్మచెక్క, మల్లెమొగ్గ, ఓలమ్మో గైరమ్మ, హట్కె బతికె వంటి మాటలలో గైర్, హట్ వంటి హిందీ/ఉర్దూ పదాలు మిలాయించారు.

అవే కళ్లు సినిమాకు కొసరాజు వ్రాసిన ఇతర పాటలలో తమాషా గంగిరెద్దుపాట 'డుండుండుం గంగిరెద్దు దాసరొచ్చాడు', హాస్యజంట పాట 'చక్కని పార్కు ఉంది' కూడా ఉన్నాయి.

వీటిలో డుండుండుం పాట ట్యూన్‌కు మేరీ పాపిన్స్ సినిమాలో డిక్‌వాన్ డైక్ పాడిన 'చిమ్ చిమినీ చిమ్ చిమినీ చిమ్ చిమ్ చిరీ' పాట ఆధారం.

ప్రహ్లాద గురించి మాట్లాడినప్పుడు తెలుగు కళాకారులకు వాతావరణానికి ఇచ్చిన ప్రాధాన్యత గురించి చెప్పుకున్నాం. అలాకాక 'అవే కళ్లు' పైపైన తెలుగు రంగు వేసుకున్న హాలీవుడ్ ప్రేరిత అరవ సినిమాలాగే కనబడుతుంది. తెలుగులో పెద్దగా ఆడలేదు. ఈ సినిమా నిర్మాణంలో మెయ్యప్ప కన్నా ఆయన పిల్లల పాత్ర ఎక్కువ అని డీవీ నరసరాజు వ్రాశారు.

ఒక్క 'మా ఊళ్లో' పాట మాత్రం ఈరోజుకీ వినబడుతోంది.

## 4

అవే కళ్లు తర్వాత వచ్చిన ఏవియం సినిమాల్లో చూస్తే 'రాము' (1968) సినిమాకు కొసరాజు 'తారా శశాంకం' హాస్య వీధినాటకం వ్రాశారు.

అలాగే 1969లో 'మూగనోము' తీసినప్పుడు అందులో పిల్లలు జంతు వేషాలతో ప్రదర్శించే సింహం-కుందేలు నాటకం ఒకటి ఉంది. కొసరాజుకు ఈ సమయంలో పెద్ద ఆపరేషన్ జరిగి పాటలు వ్రాసే పరిస్థితి లేకపోతే ప్రోగ్రాం నెలన్నర పాటు ఆపి, ఆయన హాస్పిటల్ నుంచి తిరిగి వచ్చాక ఆయనతోనే ఆ పాట వ్రాయించుకున్నారట మెయ్యప్ప చెట్టియారు. అంతకు



వన్ టూ త్రీ - ఇటు రావయ్యా
అయ్యయ్యా - ఏమయ్యా ॥వన్॥
ఓహో దొరగారూ! దర్జాగా వచ్చారూ
సైఁ సైఁ సైఁ! హై హై హై
ముందుందీ హుషార్ ఒయ్ ఒయ్ ఒయ్ ॥వన్॥

చిన్నదాన్ని చేసీ నా చిలిపి వయసు దోచీ
జపాను బొమ్మలాగ కూర్చున్నావురా
నెరజాణనురా! నీ రాణినిరా
మురిపాలు కురిపించి ముద్దీయరా ॥వన్॥

నీవంటే నాకు మోజు కుదిరింది మంచిరోజు
నీ తస్సాదియ్యా చూస్కో గుమ్మవుతావురా!
సరదాదీరా సరసకు రారా
వారెవా కౌగిట్లో చిక్కావురా ॥వన్॥

ముందున్న హిట్ పాటలు తీసుకుని ఒక పేరడీ మాలికలాగ వ్రాసిన ఈ పాట బాగుంటుంది.

'చిట్టి చెల్లెలు' (1970)లో కూడా ఒక హాస్యభరిత రామాయణ ఆధారిత వీధినాటకం 'ఆహాహా ఈ వనము' వ్రాశారు కొసరాజు. అదికాక 'వన్ టూ త్రీ ఇటు రావయ్యా' అనే క్లబ్ సాంగ్ కూడా ఆయన వ్రాసిందే. ఈ క్లబ్ పాట ఆ తరహా పాటలకు తగ్గట్టుగానే ఉంటుంది. రాజేశ్వరరావు వరస వల్ల కొంత బాగానే ఉంటుంది. ఇటువంటి కొసరాజు పాటలు ఎక్కువ చూడలేదు కాబట్టి ఈ పాట సాహిత్యం మచ్చుకి చూడండి.

5

ఏవీఎం వారి తెలుగు సినిమాల్లో భక్త ప్రహ్లాద తర్వాత దరిదాపుగా ప్రతి సినిమాలోనూ కొసరాజు ఒకటి రెండు పాటలు వ్రాసేవారు. 'నోము' (1976) వరకు ఇది కొనసాగింది.




వీటిలో పైన చూసిన వాటితోపాటు 'పుట్టినిల్లు మెట్టినిల్లు' (1973) సినిమాలోని 'జమా లంగడి జమ్‌క, బొగ్గులలో రామచిలక, నిన్ను చూస్తేనే చెడ్డ కాక' అనే కామెడీ పాట సరదాగా ఉంటుంది.

ప్రఖ్యాత తమిళ దర్శకుడు కె. బాలచందర్ తెలుగులో తీసిన 'బొమ్మా బొరుసా' (1971)లో మాత్రం కొసరాజు ఒకటి తప్ప అన్ని పాటలు వ్రాశారు. వీటిలో రెండు పాటలు చూసి ఈ వ్యాసాన్ని ముగిద్దాం.

ఆడ మగ సంవాదం పాటలు కొసరాజు వ్రాసినవి చాలానే ఉన్నాయి. కొన్ని ఇంతకుముందు చూశాం. చాలావరకు అవి జనాదరణ పొందినవే.

సరదాగా అల్లరిగా వేళాకోళంగా కాక, ఇటువంటి వాటిలో మోటుగా సొంతం తిట్లలోకి దిగితే ఎలా ఉంటుందో 'సరిలే పోవే వగలాడి' పాటలో చూడొచ్చు.

ఈ పాట చూడడానికి (చంద్రమోహన్, వెన్నిరాడై నిర్మల), వింటానికి (బాలు ఎల్‌ఆర్ ఈశ్వరి), వినోదం గానే ఉంటుంది కానీ ఇంత పిచ్చిగా నాయికా నాయకులు తిట్టుకోవడం తెలుగువారి సెన్సిబిలిటీస్‌కి కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. తర్వాత వీళ్ళ 'సహజంగానే' ప్రేమలో పడటం అంత సహజంగా అని పించదు. బాలచందర్ పైత్యం అని సరిపెట్టుకోవాలి.

*ఎహే! సరిలే పోవే వగలాడీ*
*నువ్వా నాతో సరిజోడీ*

*అరె! చాల్లే పోవోయ్ బుంగమూతీ*
*నవ్వుతావేందోయ్ పండుకోతీ*

*ముద్దా! ఎద్దా!*
*గూబా దేబె*
*సిగ్గు వుందా శరముందా*
*రోసముందా మీసముందా*
*నువ్వసలు ఆడదానివా? ॥చాల్లే॥*

*నాటురకముదాన్నా? నీ మాటలు పడతానా?*
*చేతగానివాణ్ణా? నీ కూతల కోర్చెదనా?*

*వేళ మంచిదైంది నీ వీపు పనయ్యేదీ*
*పిచ్చి పట్టెనేమో తెగ పేలుతు వున్నావూ*

*చేతయ్యిందేమొ చేస్కో*
*నీ టెక్కు నీ నిక్కు సాగదయ్య నా ముందూ*

*నాదానివి ఐననాడు, గట్టులెక్కి మెట్టులెక్కి*
*నెత్తిమీద కూర్చుందువా ఆహా ఊహూ*

*జడలమారిలాగా నువ్వురిమి చూడవద్దూ*
*పోతురాజులాగా నువ్ బూకరించవద్దూ*
*అత్తకూతురమ్మో నీ పప్పులుడకవమ్మో*
*బుద్ధిలేని మావో నువ్ హద్దు మరకయ్యో*

*గయ్యాళి చిన్నదాన గంతులన్ని కట్టిపెట్టి*
*తగ్గు తగ్గు యికనైనా*
*చెల్లాటలాడవచ్చి చిన్నబోయి వణుకుతావు*
*చిచ్చుబుడ్డి బుల్లోడా॥*





బొమ్మా బొరుసా పందెం వెయ్యి
నీదో నాదో పై చెయ్యి
కమాన్- క్లైవ్ - వన్ టూ

బొమ్మా బొరుసా పందెం వెయ్యి
నీదో నాదో పైచెయ్యి
బొమ్మయితేనే నీ గెలుపు
బొరుసయితేనూ నా గెలుపు ॥బొమ్మా॥

డబ్బుంటే గద పైకెగరేయడం
అది లేందెందుకు ఊరక డంబం
సాగిన్నాడూ సర్దాగుండూ
ఎదురు తిరిగితే ఏముండూ
నడమంత్రపు సిరీ వచ్చిన్నాడూ
నెత్తికి కళ్లూ వచ్చును చూడూ ॥బొమ్మా॥

చంకీ లేందే జడవదు గుర్రం
గోతిలో పడితే లంగడా గుర్రం
చల్ చల్ బే చల్
హద్దు మీరితే హడవా గుర్రం
అదుపులో వుంటే జట్కా గుర్రం
సాధుకు కోపం రేగినప్పుడూ
వధ బట్టందే వదలిపెట్టడూ ॥బొమ్మా॥

పిండుంటేగద రొట్టె చెయ్యడం
కొప్పుంటే గద పూలు పెట్టడం
డబ్బుంటే గద డాబు చెల్లడం
ఆడపెత్తనం ఎన్నాళ్లు సాగూ
గుట్టు తెలిస్తే చిటికెలో ఆగు ॥బొమ్మా॥

'బొమ్మా బొరుసా పందెం వెయ్యి నీదోనాదో పైచెయ్యి' అన్న టైటిల్ సాంగ్ ఈ సినిమాలోని పాటలన్నింటిలో బావుంటుంది.

చంద్రమోహన్, చలంల మీద ప్రధానంగా చిత్రీకరించబడిన ఈ పాట బాలు, పిఠాపురం చాలా బాగా పాడారు. ఆర్. గోవర్ధనం సంగీతం కూడా ఉత్తేజంగా ఉంటుంది. ఆనాటికే ఎస్పీ బాలసుబ్రమణ్యం తనకంటే ఎంతో అనుభవజ్ఞులైన గాయకులతో (పిఠాపురం, ఎల్ఆర్ ఈశ్వరి) దీటుగా పాడటం గమనించవచ్చు.

ఇందులో చలంది జట్కా తోలే పాత్ర. (ఆయన కోసం 'చల్ రే బేటా' అన్న హుషారైన జట్కాబండి పాట కూడా వ్రాశారు కొసరాజు.)

బొమ్మా బొరుసా పాటలో కూడా చలం పాడే చరణం 'చంకి లేందే నడవదు గుర్రం, గోతిలో పడితే లంగడా గుర్రం' అని పాత్రోచితంగా సాగుతుంది.

ఎక్కువ పాటలు వ్రాసే అవకాశం వస్తే పాత్ర స్వభావాన్ని కొసరాజు సాహిత్యంలోకి ప్రవేశపెట్టడం ఎంత బాగా చేస్తారో ముందు కూడా అనేక ఉదాహరణలు చూశాం. (ఈ వ్యాసంలోనే సదారమ పాటలలో ఇది కనబడుతుంది. దొంగ పాడిన పాటలు చూస్తే అతని స్వభావం, జరుగుతున్న కథ కళ్లకు కట్టినట్టు అర్థమైపోతాయి.)

## 6

అవిచి మెయ్యప్ప చెట్టియార్, శ్రీనాథుడి కావ్యాల్లో చెప్పిన అవచి తిప్పయ్యశెట్టి (శ్రీనాథుడి హరవిలాసం ఈయనకే అంకితం) పరంపరకు చెందినవాడు అని ముఖపత్రంలో ఒక మిత్రుడు ఇటీవల వ్రాశారు.

మెయ్యప్ప, చెట్టినాడుకు చెందిన నట్టుకొట్టాయి నగరతర్ కుటుంబాల నుంచి వచ్చినవాడు. ఈ వంశాల వారికి సముద్ర వ్యాపారాలు వందల సంవత్సరాలుగా ఉండేవట. రాజులకు, తర్వాత జమీందారులకు అప్పులు ఇచ్చే స్థాయిలో ఉండేవారట. ఇంటి పేరుతో పాటు ఇవన్నీ చూస్తే వందల ఏళ్లనాటి ఆవచి తిప్పయ్య, ఆవచి దేవయ్య వంశానికి, మెయ్యప్ప వంశానికి సంబంధం ఉందేమోనన్న వాదానికి బలం చేకూరుతోంది.

ఏవి మెయ్యప్పన్ చెట్టియార్ పూర్వీకులు తెలుగు వారు అయినా కాకపోయినా ఆయన తెలుగులో తీసిన సినిమాలు, వాటిలో సంగీతం, తెలుగువారు కలకాలం గుర్తుంచుకుంటారు. మిగతా కవులతో బాటు కొసరాజు పాటలు కూడా ఇందులో చెప్పుకోదగ్గ పాత్ర వహించాయి.

UNDAVALLI
CONSTRUCTIONS

# PAY 10% NOW

## 0% INTEREST TILL POSSESSION

**668 LUXURY APARTMENTS**

~~2 Bhk~~, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from
1200 SFT – 4160 SFT LUXURY FLATS

APRERA APPROVED



## JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT

Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports









Design By CREATIVE ETHICS.COM +91 90 329 32953 (INDIA)

SRIVALLI PRAVAS
*Your Heaven on Earth*

# LETS YOUR DREAMS COME TRUE

## on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA

Bank Loans Available

+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA) sales@ucpl.io www.ucpl.io